PRAMUKHANDHRA 27th Year of Publication We carry the news and views of Telugus

27 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు

శ్రీ గోటేటి శ్రీ రామారావు

₹.15

జూన్, జూలై, ఆగస్టు 2021



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA,
GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA


# జయహో

టోక్యో ఒలింపిక్స్ లో భారత్ కు ప్రపంచ దేశాల మధ్య దక్కిన గుర్తింపు.

స్వర్ణం , రజతం , కాంశ్య పతకాలతో భారత్ క్రీడాకారుల ఉత్తమ ప్రదర్శన.ప్రజల అంచనాలకు న్యాయం చేస్తూ తమ సత్తా చాటిన మన బృందం. ఒలింపిక్ వేదికపై  పుత్తడి కాంతులతో వీనులవిందుగా కనుల పందగ గా అలరించి మురిపించిన జాతీయగీతం జన గణ మనతో పులకరించిపోయిన భారతీయులు.



నీరజ్ చోప్రా , స్వర్ణం



రవికుమార్ , రజతం



మీరాబాయ్ చాను , రజతం



భజరంగ్ పూనియా , కాంస్యం



లవ్లీన , కాంశ్యం



పి వి సింధు , కాంశ్యం



పురుషుల హాకీ జట్టు ,కాంశ్యం




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జూన్, జూలై & ఆగస్ట్ 2021

సంపుటి : 27 318, 319 & 320 సంచిక : 6,7&8




## ఆంధ్రులు ఆధ్యాత్మిక చింతనాపరులు!

**కలదందురు దీనుల యెడ**
**కలదందురు పరమయోగి గుణముల పాలన్**
**కలదందురు రన్ని దిశలను** – అని, బమ్మెర పోతనామాత్యుడు నుడివినట్టు – భగవంతుడు ఆర్తులందూ, ఆధ్యాత్మికపరులందూ, అన్ని దిశల్లోనూ ఉంటారనెడి నగ్న సత్యాన్ని ఆంధ్రులు సర్వే సర్వత్రా నమ్ముతారు.

భగవత్ జిజ్ఞాస, భగవతారాధన అనునది ఆంధ్రుల రక్తంలోనే ఉంది. అది పుట్టుకతోనే వచ్చింది. రామాయణ, భారత, భాగవతాలు ప్రవచించినది కూడా 'ఆధ్యాత్మిక చింతనే'! ఆదికవి నన్నయ్య నుంచీ మొన్న మొన్నటి విశ్వనాథ సత్యనారాయణగారి వరకూ తమ రచనల్ను ఆధ్యాత్మిక పరంగానే సాగించారు. తెలుగు రాజులు ఆధ్యాత్మిక రచనలు రచించడంలోనూ, కవులను ప్రోత్సహించడంలోనూ, ఆగమశాస్త్రపరంగా ఆలయాలను నిర్మింపచేయడంలోనూ, శిల్పకళను ప్రోత్సహించడంలోనూ అకుంఠితమైన దీక్షాదక్షతల్ని ప్రదర్శించారు.

'ప్రముఖాంధ్ర'ను స్థాపించిన నాటినుంచీ ఈనాటి వఱకూ ఆధ్యాత్మిక చింతనతోనే ముఖచిత్రాలు వేస్తూ వచ్చాం. తొలి సంచికపై కల్యాణ ప్రదాత తిరుపతి వేంకటేశ్వరుని ముఖచిత్రం ప్రచురించాం. ఆయన కలిమి బలిమి చెలిమిలతోనూ ఈనాటి ఈ 12వ సంచికవఱకూ 'ప్రముఖాంధ్ర' నిర్విఘ్నంగా వస్తూ తనదైన బాణీలో, తెలుగువారిలో స్పందన కలుగచేస్తూంది.

ఆధ్యాత్మిక చింతన యెపుడూ మానవునిలో మానసిక ప్రశాంతతను పెంపొందింపచేస్తుంది. మంచి భావాలను కల్గిస్తూంటుంది. సేవా పరాయణ ధర్మాన్ని పెంపు చేస్తుంది. అందుకే ఈ బాణీని 'ప్రముఖాంధ్ర' అలవరచుకుంది.

అంతేగాకుండా భగవంతుడు తెలుగువారిలో తమ మాతృభాషయైన తెలుగుపై మమతను బుట్టించి, తెలుగు అధ్యయనం, భాషా వికాసం కల్గింపచేస్తాడనీ– విశ్వంలో రెండవ భాషగా తెలుగును వ్యాప్తినొందింపచేస్తాడని కల్గుతుందని అస్మదీయుని అభిప్రాయం. అందుకై భగవంతుని అంజలి ఘటిస్తున్నాను. భాషాభ్యున్నతికి తోడ్పడమని 'ప్రముఖాంధ్ర'ను చిరంజీవిని చేయమనీ మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను.

**జై ఆంధ్ర**



*బుధజన విధేయుడు*
***– గోటేటి శ్రీరామారావు***
(నవంబర్ 2007, ప్రముఖాంధ్ర)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**




పంచముఖ గణేశుని ప్రతిమలో నాల్గు ముఖాలు పైన అయిదోవదీ వుంటుంది. తిరునల్లారులోని గణేశమూర్తి సాలగ్రామ శిలగా దర్శనం ఇస్తాడు. మధురైలోని ధాన్య–ఆహార గణపతిని చూచి తీరవలసిందే. చిదంబరంలోని తిరుపవనం, మైసూరులోని హెయసల గుళ్ళలో గణపతి నృత్యం చేస్తూ కనులకు విందు చేస్తున్నాడు.

## చోడవరం

విశాఖ జిల్లాలోని చోడవరంలో వున్న విఘ్నేశ్వరాలయానికి ఒక విశిష్టత ఉన్నది. ఇక్కడి మూర్తి కొన్ని వేల సంవత్సరాల క్రిందట వెలసిన 'స్వయంభూ'గా చరిత్రకారులు గుర్తించారు. చోడవరానికి తూర్పుముఖంగా వున్న ఈ గుడిని సుమారుగా 6000 వేల సం॥లగా ఉందట; మత్స్యవంశపు రాజులు నిర్మించారు. ఇక్కడ మూర్తిని మత్స్య గణపతిగా పేర్కొంటారు. తురుష్కుల దండయాత్రలో చెదరిన ఈ ఆలయాన్ని చోళులు తిరిగి పునర్నిర్మించారు. ఆంధ్ర రాష్ట్రంలో కాణీపాకం తర్వాత స్వయంభూగణపతి వున్న ప్రదేశం చోడవరం కావడం విశేషం. అవ్వడానికి పురాతనమే అయినా గడచిన 200 సం॥ల క్రిందట నుంచీ ఇక్కడ పూజా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి గణపతి నడుము వరకే దర్శనం ఇస్తాడు. తొండం చివర కన్పించదు. ఈ విగ్రహం యేటేటా పెరుగుతుందని ప్రతీతి. ప్రస్తుతం పాతచెరువు వద్ద వెలసిన ఈ మూర్తిని భూమినుంచి త్రవ్వి – గౌరీశ్వరాలయం లోనికి తీసుకుని వెళ్లడానికి ప్రయత్నించగా అది సాధ్యపడలేదు సరికదా! తొండం చివర చూద్దామని 20 అడుగుల భూమిని తవ్వినా, అది కన్పించలేదట. ప్రస్తుతం ఈ తవ్విన భూమిని ఏనుగు బోదె అని పిలుస్తున్నారు. ఇక్కడ చెరువు ఒకటిని నిర్మించారు.

# "విశ్వ" పూజనీయుడు మన శ్రీగణేశుడు

**విఘ్నః** అనే పదానికి విశ్వమంతా వ్యాపించినవాడని వేదం నిర్వచిస్తోంది. సరిగ్గా ఇటువంటి అర్థాన్నే 'గణ' అనే పదం కూడా సూచిస్తున్నదని వల్లో(ల్ల)భోపనిషత్తు, అధర్వశీర్షములు పేర్కొనడం ఒక విశేషం. దీనినిబట్టీ చూచినట్లయితే మన చిరు బొజ్జ గణపయ్య కేవలం ఒక్క భారతావనిలోనే కాక మిగిలిన ఖండాలలో కూడా పూజలందుకుంటున్నట్లు తెలుస్తున్నది.

ఇరాన్‌లోని శ్రీ గణేశమహరాజ్, చైనా, థాయ్‌లాండ్, అమ్‌స్టర్‌డామ్, జావా, కాబూల్, మెక్సికోలోని గణేశులు, ఆఫ్ఘనిస్తాన్, తుర్కిస్తాన్‌ల్లోని వినాయకులు, జపాన్‌లోని వజ్ర వినాయకమూర్తి, నేపాల్‌లోని విఘ్నేశ్వరమూర్తులు ప్రపంచంలోని అతి పురాతన విగ్రహమూర్తులుగా గుర్తించబడినాయి.

జబల్‌పూర్‌లోని భేరిఘాట్ వద్ద వినాయకుడు 'గణేశిని' అనే స్త్రీమూర్తి రూపంలో దర్శనం ఇస్తాడు. తమిళనాడులోని మధురైలో వాఘ్య్రపాచనిగానూ, రాయవెల్లూరు కోటలోని జలకంఠేశ్వర దేవాలయాలలో ప్రాకులాడే బాల గణపతిగానూ, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైల క్షేత్రంలో వేణు గణపతిగానూ దర్శనం ఇస్తాడు.

బోర్నియోలో "మహభిని"గా, మంగోలియాలో "టోట్కరు" నిగా, టిబెట్‌లో "చోప్రాకు"నిగా, కంబోడియాలో "బృహగణేశు" నిగా, చైనాలో "వాన్ని దియార్"గా, జపాన్‌లో "వినాయసునిగా" గణేశ ఆరాధనం జరుగుతోంది. (వజ్రగణేశుడు).

చైనాలో 'సైని' అనే చక్రవర్తి నిర్మించిన అతి ప్రాచీనమైన గణేశుని రాతి దేవాలయాన్ని నేటికీ మనం చూడవచ్చును.

నేపాల్‌లో పంచముఖ గణేశ ఆలయం సుప్రసిద్ధమైనది.

జావాలోని ధ్యానముద్ర గణపతి టూరిస్టులకు ఒక ప్రత్యేక ఆకర్షణగా భాసిల్లుతున్నాడు.

తమిళనాడులోని తిరువత్తియూర్‌లోని గణేశ్ ఆలయంలోని మూర్తికి రావణ బ్రహ్మకు మాదిరిగా ఒకే వరుసలో పంచశిరములు వుంటాయి. నాగపట్నంలోని

## అయినపల్లి

తూ.గో.జిల్లా అమలాపురంకు అత్యంత చేరువలో అత్యంత పురాతనమైన అయినవిల్లి గణేశ క్షేత్రం వున్నది. ఈ క్షేత్రం పూర్తిగా దేవతానిర్మితం. దక్షయజ్ఞ ప్రారంభసమయంలో దక్షుడు ఇక్కడ స్వామిని పూజించడం వల్లనే శిరస్సు తెగినా మేక శిరస్సుతో పునర్జీవితుడైనట్లు క్షేత్రపురాణం చెబుతున్నది. ఇక్కడి స్వామి నారికేళ ప్రియుడుగా ప్రసిద్ధుడు.

## కాజీపేట

హైదరాబాద్ – హన్మకొండ రహదారిలోని రైల్వే దేవా లయం భవనసముదాయంలో వున్న శ్వేతార్కముల గణపతి ఆలయం కోరిన కోర్కెలు తీర్చడంలో పేరుగాంచింది. ఇక్కడ మూర్తి జిల్లేడు మొక్క నుంచి ఉద్భవించాడు. విదేశీయులు సైతం ఈ క్షేత్రాన్ని సందర్శించి ధన్యులవుతుంటారు.

## రాయదుర్గం

రాయదుర్గం కోట మెట్ల వద్ద ఆత్మకూరు వీధిలో వున్న 12.5 అడుగుల ఎత్తులో వున్న దశభుజ గణపతిని సందర్శించి తరించాల్సిందే కానీ వర్ణింప నలవికాదు. అదేవిధంగా అమరావతిలోని ధరణికోటలోని నాలుగు అంతస్తుల విఘ్నేశ్వరుని గర్భాలయం రమణీయతను చూడవల్సిందేగాని చెప్పనలవికాదు. ఈ ఆలయ నిర్మాణానికి సుమారుగా 75 లక్షలు ఖర్చు అయ్యింది. 44 తర్పణాలలో ఇక్కడ మూర్తిని 'గ'కారంతో అర్చిస్తే సర్వకోర్కెలు సఫలం అవుతాయి.

## కుర్తాళం

తమిళనాడులోని కుర్తాళంలో వున్న నాడీగణపతి ఆలయం విశిష్టమైంది. కొన్ని వందల సం॥ల క్రిందట మౌనస్వామి అనే సాధువు ఇచ్చట మూర్తికి హారతి ఇస్తుండగా ఆ హారతి సెగకు స్వామివారి విగ్రహం స్పందించి కొంచెం వెనక్కు

జరిగిందట. అంటే స్వామివారికి నాడీ స్పందన వున్నట్లుగా అప్పుడే రూఢీ అయ్యింది. స్వామివారి తొండము, తొడలందు ఈ నాడీ స్పందన శబ్దాన్ని మనం చెవియొగ్గి వినవచ్చు కూడానూ!

## ముంబాయి

ముంబాయి దక్షిణ ప్రాంతంలో పోర్చుగీసువారు నిర్మించి- స్థాపించిన సిద్ధివినాయక దేవాలయం ప్రాచీనమైనది. ఇక్కడి స్వామి సుమారుగా 36 అడుగుల ఎత్తు మాత్రమే వుంటారు. కృత్రిమమైన రంగులు వేయడం వల్ల విగ్రహం తన ప్రాచీనతను కోల్పోయినట్లుగా కన్పిస్తుంది. అత్యధిక రాబడి గల ఆలయాల్లో ఇది మొదటి స్థానంలో నిలుస్తున్నది (45ల/సం॥రానికి కోల్‌కత్తా) కె.ఆర్. రామకృష్ణన్ అనే వ్యక్తి మార్చి- 2001 లో జరిగిన క్రికెట్ క్రీడలో భారతజట్టు విజయం సాధించాలని ఈ ప్రదేశంలో క్రికెట్ గణేశ్ ఆలయాన్ని నిర్మించాడు. భక్తుని కోరిక భగవంతుడు తీర్చడంతో ఈ ఆలయం వార్తల్లోకెక్కింది. ఆ ఆలయంలో ఎడమ-కుడి వైపుల తొండములున్న ఇద్దరు గణేశులు పూజలందుకోవడం మరొక విశేషం.

## సాకోరి

షిర్డికు 12 కి.మీ. దూరంలో సాకోరి అనే ప్రదేశంలోని ఉపాసనీ మందిర ఆవరణంలో వున్న ఒక మునగచెట్టు కొమ్మపై చిత్రంగా గణేశుడు వెలిశాడు. ఈ స్వామి మునగ గణపతిగా భక్తుల పూజలందుకుంటున్నాడు.

## తిరుప్పవనం

మధురై (తమిళనాడు)నుంచి రామేశ్వరానికి వెళ్లే దారిలో వైగైనది దక్షిణ తీరంలో ముక్తిగణేశుని ఆలయం చెప్పుకోదగినది. మృతుల అస్తికలను వైగైనదిలో నిమజ్జనం చేసిన అనంతరం ఇక్కడి స్వామిని అర్చిస్తే, మృతులకు ముక్తిలభిస్తుంది. కాశీ, రామేశ్వరం వెళ్ళలేనివారు ఇక్కడ కర్మకాండలు నిర్వహించుకో వచ్చును.

## టిట్‌వళా

ముంబాయి - కాసారా మధ్యనున్న లోకల్ రైలు మార్గంలోని టిట్‌వళా నుండి 2 కి.మీ. దూరంలో ఒక మహా గణేశ మందిరం వుంది. 36 అడుగుల పీఠంపై చతుర్భుజాలతో వుండే ఈ స్వామిని దర్శించిన పెళ్ళికాని యువతీ-యువకులకు తక్కున పెళ్ళిళ్ళు జరిగిపోతున్నాయి. కుజదోషం వున్నవారు తప్పక చూడవలసిన క్షేత్రం ఇది.

## వాయి

సతారా జిల్లా పూనేకి 100 కి.మీ. దూరంలో వాయి అనే ప్రాంతం వుంది. ఇక్కడ గణేశుడు డోల్యాగణపతికి అర్చనలు అందుకుంటున్నాడు. 10 అడుగుల ఎత్తు, 8 అడుగుల వెడల్పు కల మూర్తి దుస్వప్నాలను నివారిస్తాడని ప్రతీతి.

## శ్రీలంక (కంచ్)

శ్రీలంకలోని 'పర్ర్యా'కి- యవతమళ అనే ప్రాంతాలకు దగ్గర్లో 'కళంబ' వద్ద చింతామణి గణేశ నామంతో (ఏక వింశతి-21-శక్తి పీఠాల్లో ఇదొకటి) వినాయకుడు పూజలందు కుంటున్నాడు. ఈ గుడి భూగర్భంలో 12 మీటర్ల లోతున వుంటుంది. ఇక్కడ పుష్కరానికొక (12 సం॥రాలు) ఉత్సవం చేస్తారు. గౌతముని శాపం పొందిన ఇంద్రుడు ఇక్కడకు వచ్చి చింతామణి గణేశుని పూజించాడని పురాణ కథనం. ఈ మందిరానికి త్రిప్రవేశ ద్వారాలు వుండటం ప్రత్యేకత. చతుర్ముఖాలల్లో అలరారే ఈ స్వామిని పరివేష్టిస్తూ మరో నల్గురు గణేశులు వుండటం ఇక్కడ మాత్రమే చూడగలం.

## పుళే-ఉం


మహారాష్ట్రకు దక్షిణంగా 350 కి.మీ. దూరంలో రత్నగిరి జిల్లా సాగర తీరాన అతి ప్రాచీనమైనదిగా చెప్పబడుతున్న పుళే-ఉ అనే ప్రాంతంలోని శ్రీ గణేశ దేవాలయం తప్పక చూడవలసిన క్షేత్రం. ఇక్కడ స్వామివారు పుళేగణపతి (నిరాకారుడని అర్థం) అని, 'ఉరి' అనగా తడిసిన ఇసుక అని అర్థం) పేర్లలో పూజలందు కుంటున్నాడు. ఈ క్షేత్రాన్ని ఛత్రపతి శివాజీ మంత్రి అన్నోంజీ నిర్మించాడు. నూతన కట్టడాలు నిర్మించే ముందు ఈ స్వామి అనుగ్రహం పొందడం ఉత్తమం.

## హేందవీ

ముంబాయి- గృహగర్‌కు 23 కి.మీ. దూరంలో (రత్నగిరి జిల్లా) 3 1/2 అడుగుల ఎత్తైన లక్ష్మీగణేశుని హేందవీ క్షేత్రం పాలరాతి శిల్పంగా దర్శనం ఇస్తుంది. ఇక్కడి స్వామి దశ భుజుడు. లక్ష్మీకటాక్షం అవిఘ్నంగా పొందాలనుకునేవారు చూడవలసిన క్షేత్రం ఇది.

## కాణిపాకం

చిత్తూరుకు 12 కి.మీ. దూరంలో ఐరాల మండలం అనే ప్రదేశంలో "విహారపురి" (కాణిపాకం యొక్క అసలు పేరు) అనే ప్రదేశంలోని వరసిద్ధి వినాయకుని కేత్రం జగద్విఖ్యాతం. ఇది 11వ శతాబ్దానికి చెందిన దేవాలయముగా చరిత్ర పేర్కొన్నది. కుళోత్తుంగుడనే చోళరాజు బ్రహ్మహత్యాపాతక పరిహారం కోసం ఈ క్షేత్రాన్ని నిర్మించగా విజయనగర రాజులు దీనిని వృద్ధి పొందించారు. ఈ స్వామివారి విగ్రహం రోజు రోజుకూ పెరుగు తున్నది అనడానికి నిదర్శనంగా 1956లో స్వామివారికి చేయిం చిన వెండితొడుగు నేడు ఆయనకు పట్టడంలేదు. కాణి అనగా 1-25 ఎకరములు అని, 'పాకం' అనగా కొబ్బరియని అర్థము. ●





# మానవత్వం పరిమళించే శ్రీదేవి

శ్రీమతి లేళ్లపల్లి శ్రీదేవి, నాకు గత కొన్నేళ్లుగా తెలిసిన ఉదాత్తమైన మహిళామూర్తి. మచ్చలేని చందమామ. తన గురించి తెలుసుకుందాము.

## ఆ రోజుల్లోనే బెస్ట్ యూత్ అవార్డ్

శ్రీదేవి స్వస్థలం వరంగల్. శ్రీ రమేష్ గారితో వివాహమయ్యాక భర్త ఉద్యోగ రీత్యా పది సంవత్సరాల క్రితం చెన్నై వెళ్లారు. బాల్యం నుంచే ఆమె ఇంట్లో వాడకంలో లేని వాటిని అమ్మి, ఆ డబ్బులను అనాథలకు వస్తురూపంలో అందించేవారు. డిగ్రీ చదివేటప్పుడు వరంగల్ నెహ్రూ యువజన కేంద్రంలో మూడేళ్ల పాటు పని చేశారు. పల్లెటూళ్లకి వెళ్లి, యువతకి ప్రభుత్వ పథకాలగురించి తెలియజెప్పి వారిని ఉత్తేజపరిచారు. అక్కడ చేసిన విశేష కృషికి ఆమె 1999లో యువతకు ఇచ్చే 'బెస్ట్ యూత్ అవార్డు' అందుకున్నారు. యువజన సేవాకార్యక్రమాలలో భాగంగా ఆమె తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు, రెండు తెలుగుప్రాంతాలకు కూడా వెళ్లారు.



ఎస్. జానకి గారితో శ్రీదేవి

2003 లో తనకొక ఆలోచన వచ్చింది. రావడమే తడవుగా... ప్రతి నెలా తన ఇంట్లో ఉన్న పాత పేపర్లను అమ్మగా వచ్చిన రెండు మూడు వందల రూపాయలతో దగ్గర్లో ఉన్న అనాథ ఆశ్రమాలకి వస్తురూపేణా ఆవిడ ఏదైనా కొని ఇచ్చేవారు. ఒకసారి వారుంటున్న ఐఐటిలో సత్సంగ సమయంలో, తను చేస్తున్న సేవగురించి స్నేహితురాళ్ళకు చెప్పగా, వారంతా కూడా ఆమెతో చేయి కలిపారు. ఆ తర్వాత ఆమె చుట్టుపక్కల ఉన్న అపార్ట్ మెంట్‌లకు వెళ్లి, తను చేస్తున్న పని గురించి చెప్పి, వారికి ప్రేరణ కలిగించి, కేవలం పాత పేపర్లు అమ్మగా వచ్చిన డబ్బుతో రెండు అనాథాశ్రమాలను దత్తత తీసుకున్నారు. ఆమె భర్త లేళ్లపల్లి రమేష్ గారు తయారుచేసిన సంగీత చక్రంతో ఒకసారి అబ్దుల్ కలాం గారిని కలవగా, ఈ దంపతులు చేస్తున్న సేవకు వారు ఎంతగానో అభినందించి, పిల్లలను ఈ సేవ దిశగా మోటివేట్ చేయాల్సిందిగా సూచించారు. అప్పటినుంచి ఆమె దేశ వ్యాప్తంగా ఉన్న అనేక స్కూల్స్‌కు వెళ్లి అక్కడి పిల్లలు కూడా సేవ చేసేలా ప్రేరణ కలిగించారు. ఆమె వెలిగించిన చిరుదీపం ఈ రోజున, అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపుతోంది.



శ్రీ రమేష్

## ఫేసెస్ అంటే..

'ఫేసెస్' (ఫుడ్, ఎయిడ్, క్లోతింగ్, ఎడ్యుకేషన్, షెల్టర్) అనే సొంత కాన్సెప్ట్‌తో అనాథల సంరక్షణలో పాల్పంచుకుంటూ పాఠశాల, కళాశాల విద్యార్థులను అందులో భాగస్వామ్యులను చేస్తున్న శ్రీదేవి, ప్రస్తుతం ఆమె చెన్నైలోని పూవనం, ఏరాసమాజ్ అనాథాశ్రమాలను, వరంగల్‌లోని మల్లికాంబ మనో వికాస కేంద్రం, సాయి అనాథ సేవాసమితి ఆశ్రమాలను దత్తత తీసుకుని వారికి బియ్యం బస్తాలు కొనివ్వడం, వారు ఉంటున్న నివాసాలకు అద్దె కట్టడం వంటివి చేస్తున్నారు. శ్రీదేవి 2012 నుంచి ఇన్‌హోమ్ చారిటీ నిర్వహిస్తున్నారు. అంటే స్కూలు, కాలేజీ పిల్లల దగ్గరకు వెళ్లి, వారిని కూడా సామాజిక సేవవైపు ప్రేరేపిస్తున్నారు శ్రీదేవి.

"చెన్నైలోమొత్తం 10 లక్షల మంది విద్యార్థులున్నారు. వారందరూ తలచుకుంటే ఒక్క అనాథ కూడా తిండికి బాధపడక్కర్లేదు. మా కాలనీలో ఉన్న శంకర విద్యాలయం నుంచి నా కార్యక్రమాన్ని ప్రారంభించాను. విద్యార్థులతో వారి దగ్గర ఉన్న పాత వార్తాపత్రికలను అమ్మించి, ఆ డబ్బులతో బియ్యం కొని ఆ విద్యార్థుల చేతే అనాథలకు ఇప్పిస్తున్నాను. అలాగే ఒక అనాథ శరణాలయం నుంచి పిల్లల్ని మరో అనాథ శరణాలయానికి తరచు తీసుకెళుతుంటాను. ఇలా చేయడం వల్ల వాళ్లు ఎంతో సంబరపడతారు. వాళ్లు ఒకరికొకరు గ్రీటింగ్ కార్డులు ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయాన్ని కూడా ప్రారంభించాను" అని చెబుతారు శ్రీదేవి.

శ్రీదేవి, ఆమె సేవాసహచరులు ఎవరిదగ్గరా డబ్బు రూపంలో ఒక్క పైసా తీసుకోరు. కేవలం వస్తు రూపేణా మాత్రమే తీసుకుని, సేవా వారధులుగా పనిచేస్తారు. "మావారు రమేష్ రూపొందించిన సంగీతచక్రాన్ని అమ్మగావచ్చిన సొమ్మును అనాథలకు సహాయం చేయడానికి వినియోగిస్తున్నాను. ప్రస్తుతం ఆయన 50 సంవత్సరాల క్యాలెండర్‌ను రూపొందిస్తున్నారు. అది విజయవంతం అయితే, దాని మీద వచ్చే రాబడిని కూడా ఈ సేవా కార్యక్రమాలకే వెచ్చిస్తాను" అని చెప్పారు శ్రీదేవి.

## వరించి వచ్చిన అవార్డులు


వినూత్నమైన ఆలోచనలతో, ఆచరణశీలతతో అనాథల సంక్షేమానికి పాటుపడుతున్న లేళ్లపల్లి శ్రీదేవి... దాదాపు నాలుగు వందల మంది అనాథలున్న రెండు అనాథాశ్రయాలను దత్తత తీసుకుని చేస్తున్న కృషికి గుర్తింపుగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'రెక్స్' బంగారు పతకం అందుకున్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'కర్మవీర చక్ర'ను ఢిల్లీలో అందుకున్నారు. ఇప్పటిదాకా ఈ గోల్డ్ మెడల్ మొత్తం ఎనిమిది మందికి మాత్రమే లభించింది. ఐక్యరాజ్యసమితి ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన అవార్డు ఇది. ఏషియన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్' వారిచ్చే 'అసాన్ మహిళాఆఫ్‌ద ఇయర్' అవార్డు, కాళీపట్నం ఆర్ట్స్ అకాడమీ వారు 'మహిళా ప్రతిభా అవార్డు'ను కూడా ఆమె అందుకున్నారు. వీరి వెబ్‌సైట్‌ను www.faces108.com దర్శించవచ్చు.

## ప్రస్తుతం సమస్య ఏమిటి?

కరోనా కారణంగా చాలామంది పేపర్లు కొనడమే మానేశారు. లాక్‌డౌన్లు, పరిమిత నియమాల వల్ల ఎక్కడికి స్వయంగా వెళ్లి పేపర్లు సేకరించి అమ్మి ఆ డబ్బులను అనాథ పిల్లలకు ఇచ్చే పరిస్థితి లేదు. అందుకే తను నా సహాయాన్ని అర్థించింది. మనలో కొంతమందిమైనా ఇంకా పేపరు తెప్పించుకుంటున్నామని భావించి, నెలకు ఆ నాలుగొందల రూపాయలను తన ఖాతాలో జమ చేస్తే, ఆ అనాథాశ్రమాల పిల్లలు మన పేరు చెప్పుకుని, ఇంత తిండి తింటారు. నేనూ తనకీ సాయం చెయ్యడానికి రెడీ. ఈపోస్ట్ చదివాకా మరెవరికైనా ఆసక్తి కలిగితే, దిగువ నెంబరులో వాట్స్ ఆప్ ద్వారా తనను సంప్రదించగలరు. శ్రీదేవి 9445360139 (whatsapp / Gpay No).

– భావరాజు పద్మిని

# అపర తుంబురుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ



మంగళంపల్లి బాల మురళీకృష్ణ 6, జులై, 1930న తూర్పు గోదావరి జిల్లా శంకరగుప్తం గ్రామంలో జన్మించారు. తండ్రి పట్టాభిరామయ్య శాస్త్రీయ సంగీతంలో విద్వాంసులు ఈయన ఫ్లూటు, వొయొలిన్, వీణ వాయించేవారు. బాలమురళి తల్లి సూర్యకాంతమ్మ గారు వీణ విద్వాంసురాలు. ఈమె ప్రముఖ విద్వాంసులు ప్రయాగ రంగ దాసు గారి పుత్రిక.

బాల్యంలోనే మురళీకృష్ణ సంగీతం పట్ల కనబరచిన ఆసక్తిని చూసి తండ్రి తన ఎనిమిదేళ్ళ కుమారుడిని పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి వద్ద శిష్యరికానికి తీసుకువెళ్లారు. పారుపల్లి రామకృష్ణయ్య గారు త్యాగరాజు శిష్యపరంపరలో నాలుగోతరం వారు. త్యాగరాజు ప్రత్యక్ష శిష్యులైన ఆకుమడుగుల మానాంబుచావడి వెంకటసుబ్బయ్య వద్ద సుసర్ల దక్షిణామూర్తి గారు శిష్యరికం చేయగా, పారుపల్లి రామకృష్ణయ్య గారు దక్షిణామూర్తి గారివద్ద శిష్యరికం చేశారు. గురువుగారి దీవెనలతో మురళీకృష్ణ తన తొలి కచేరి విజయవాడలో 18, జులై, 1940 న సుసర్ల దక్షిణామూర్తి గారి స్మారకం సందర్భంగా నిర్వహించిన సంగీత సభలో చేశారు. మురళీకృష్ణ గాత్ర కచేరీని తిలకించిన హరికథా కళాకారులు ముసునూరి సూర్యనారాయణ భాగవతార్ గారు మురళీకృష్ణకి "బాల" అనే బిరుదునిచ్చారు. ఆనాటినుండి మురళీకృష్ణ బాలమురళీకృష్ణగా పేరు పొందాడు.

బాలమురళి పదిహేనవ ఏటనే 72 మేళకర్త రాగాలని సాధన చేసి స్వయంగా కృతులని కూడా రచించారు. 1952 లో వీరి సంగీతం జనక రాగ మంజరి ప్రచురణ అయి తదుపరి 'రాగాంగ రవళి' అనే పేరుతో తొమ్మిది సంచికలుగా సంగీత రికార్డింగ్ కంపెనీ వారు విడుదల చేశారు. 2, జులై, 1941 న ఆకాశవాణి లో చేరి చాలా ప్రాచుర్యం పొంది కచేరీలు కూడా ఇవ్వడం ప్రారంభించారు.

జనవరి, 1942లో తన గురువుగారు పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారితో పాటు త్యాగరాజ స్వామి వారు నివసించిన తిరువాయూర్ (తంజావూర్ జిల్లా)లో వారి ఆరాధనోత్సవంలో గాత్ర కచేరి చేశారు. వీరి గాత్ర పటిమని తిలకించి తిరువాయూర్ లో త్యాగరాజస్వామివారి సమాధిని నిర్మించిన ప్రఖ్యాత గాయనీమణి బెంగళూరు నాగరత్నమ్మాళ్ ఈ బాలుడు (బాలమురళి) భవిష్యత్తులో జగద్విఖ్యాతి పొందిన సంగీత విద్వాంసుడు అవుతాడని ఆశీర్వదించింది. 1944 లో బాలమురళి కర్ణాటక సంగీత దిగ్గజాలైన అరైకుడి రామానుజ అయ్యంగార్, చిత్తూర్ సుబ్రమణ్య పిళ్ళైల గాత్ర కచేరిలలో సహ వాద్యకారుడిగా వయోలాతో జనాలని అలరించారు. 23 ఏళ్లకే 1953లో భారత రాష్ట్రపతిచేత స్వర్ణ పతకం బహుమతిని పొందారు. అప్పట్లో విజయవాడ ఆకాశవాణిలో బాలాంత్రపు రజనీకాంత రావుగారి భక్తి రంజని కార్యక్రమం ప్రతీరోజు ఉదయం ప్రసారమయ్యేది. హైదరాబాదు ఆకాశవాణి ప్రొడ్యూసర్ గా బాలమురళి భక్తి రంజని కార్యక్రమం బాగా ప్రాచుర్యం పొందటానికి ప్రత్యేక శ్రద్ధ వహించారు. బాలమురళి ఆకాశవాణిలో ఏడు విభిన్న శాఖలలో ఉన్నత స్థాయి కళాకారుడిగా గుర్తింపబడ్డారు. ఇది ఒక కళాకారునికి దక్కిన చాలా అరుదైన గౌరవం.

1967 లో బాలమురళి ఎస్. వీ. రంగారావు, అంజలీ దేవి నటించిన భక్త ప్రహ్లాద తెలుగు చిత్రంలో నారదుడి వేషం వేసి తన పాటలు తానే స్వయంగా పాడుకుని ప్రేక్షకుల మన్నన పొందారు. నటుడిగా, సంగీత దర్శకుడిగా, ప్లే బ్యాక్ గాయకుడిగా తమిళం, తెలుగు, కన్నడ, మళయాళ, సంస్కృత భాషలలో దాదాపు 30 చిత్రాల పైన తన ప్రతిభను చాటారు. 1976 లో కన్నడ సినిమా హంసగీతిలో ప్లేబాక్ గాయకుడిగా జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. 1987 లో ఉత్తమ సంగీత దర్శకుడిగా మధ్వాచార్య సినిమాకి మరల జాతీయ పురస్కారాన్ని పొందారు. ఈ విధంగా చిత్రసీమలో రెండు జాతీయ పురస్కారాలు పొందిన కర్ణాటక విద్వాంసుడిగా బాలమురళి చరిత్ర సృష్టించారు. 2005 లో ఫ్రెంచ్ ప్రభుత్వం వారి అత్యున్నత పురస్కారం (చేవలియర్స్) వీరికి లభించింది.

1960 –1980 కాలంలో బాలమురళి ప్రఖ్యాత వాగ్గేయకారులు – తాళ్ళపాక అన్నమాచార్యులు, భద్రాచల రామదాసు, ప్రయాగ రంగదాసు ( బాలమురళి గారి మాతామహులు), సదాశివ బ్రహ్మేంద్రులు, తిరువాన్కూర్ మహారాజు స్వాతి తిరుణాల్ రామ వర్మల సంగీత సాహిత్యాలపై పరిశోధన చేశారు. బాలమురళి కర్ణాటక సంగీతంలో తన సృజనాత్మకతతో కొత్త బాణీలని కూర్చినప్పుడు వాటిని నిరశించిన సంప్రదాయ శాస్త్రీయ కళాకారులు కొందరు వాటిని ఘాటుగా విమర్శించినప్పటికీ ఆ విమర్శలకి బాలమురళి తన సంగీతం తోనే ధీటుగా సమాధానం చెప్పారు.

12 వ శతాబ్దంలో జయదేవుడు రాసిన గీత గోవిందం అష్టపదులని ఆలపించిన తొలి శాస్త్రీయ సంగీత గాయకుల లో బాలమురళి ఒకరు. పండిట్ భీంసేన్ జోషి, పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, పండిట్ అజోయ్ చక్రవర్తి, కిషోర్ అమోంకర్ ల వంటి హిందుస్తానీ విద్వాంసులతో బాలమురళి జుగల్బందీలో పాల్గొన్నారు. గాత్రంతో పాటు అంతే సమానం గా కంజీర, మృదంగం, వయోల, వయోలిన్ వాద్యాలు వాయించడంలో బాలమురళి ఉద్దండులు. పాశ్చాత్య సంగీత వాద్యం అయిన వయోల తో అద్భుతంగా కర్ణాటక సంగీతాన్ని పలికించి, పలు కచేరీలలో ఇతర విద్వాంసులకి పక్క వాద్యంగా, తన వయోలాతో ప్రధానంగా విడిగా ఎన్నో కచేరీలు చేసి కళాభిమానుల మన్ననలు పొందారు.

తాళ విధానంలో బాలమురళి కొత్త ప్రయోగాలు చేశారు. ఆకాశవాణిలో, బంగ్లా దేశ్ రాజధాని ఢాకా లో రబీన్ద్ర సంగీత్ ( బెంగాలీ) కార్యక్రమం చేసి బాలమురళి బెంగాలీల మన్ననని పొందారు. తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు వీరిని ఆస్థాన గాయకులుగా గౌరవించాయి. శృంగేరీ శారదా పీఠం, తిరుమల తిరుపతి దేవస్థానం వారు వీరిని తమ ఆస్థాన గాయకులుగా నియమించారు. 2008 లో తిరుమల దేవాలయం మహాద్వారం యొద్ద భక్త సమూహం మధ్యన తిరుమేలేశుని కీర్తించే అరుదైన అవకాశం బాలమురళిని వరించింది.

బ్రిటిష్ వాద్య బృందంతో రబీన్ద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి గానం చేసి బాలమురళి విదేశీయులని రంజింపచేశారు. బాలమురళి ఫ్రెంచ్ భాషలో, మరియు జాజ్ సంగీతం గానం చేశారు. సంగీతం ద్వారా చికిత్స చేయవచ్చని గ్రహించి ఆ దిశగా ఎన్నో పరిశోధనలు చేశారు కానీ దురదృష్టవశాత్తు ఆర్థిక వనరుల లోపం వల్ల ఆ పరిశోధనలని నిలిపివేశారు.

ఒక గాయకుడిగా, కృతి కర్తగా, సంగీత దర్శకుడిగా, నటుడిగా, వాద్యకారుడిగా, పలు వాద్యాలు వాయించే సంగీత కళాకారుడిగా బాలమురళి రాణించేరు. కర్ణాటక సంగీత సంప్రదాయాన్ని విడిచిపెట్టకుండా, దానికి సృజనాత్మతని జోడించి వినూత్న రీతిలో కొత్త ఒరవడి తో తనదైన శైలిలో బాలమురళి చెరగని ముద్ర వేశారు. వాక్శుద్ధి తో మిళితమైన కంఠ మాధుర్యంతో భావయుక్తంగా గానం చేయటం, అటు సాహిత్యానికి, ఇటు సంగీతానికి పరిపూర్ణ న్యాయం చేకూర్చటం బాలమురళి యొక్క విశిష్టత. కచేరీ చేస్తున్నప్పుడు సమయస్ఫూర్తితో మెలగటం, ప్రేక్షకులని ఆసాంతం అయస్కాంతంలా కట్టిపడేయటం బాలమురళికి వెన్నతో పెట్టిన విద్య. 'బాలమురళి లాంటి కళాకారులు దేశ చరిత్రలో అరుదుగా ఉద్భవిస్తారు' అన్నారు స్వామి చిన్మయానంద. 1991 లో భారత ప్రభుత్వం నుండి పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్న ఈ 'భారతరత్న( 22, నవంబర్, 2016న తనువు చాలించారు. కర్ణాటక సంగీతం వున్నంతకాలం బాలమురళి కృష్ణ పేరు చిరస్థాయిగా నిలిచివుంటుందనటం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

– డాక్టర్ . బీ. యన్ . వీ. పార్థసారధి

# మనసును శుద్ధి చేసుకోవడం ఎలా...

భక్తో భక్తి గుణావృతే ముదమృతాపూర్ణే ప్రసన్నే మనః కుంభే సాంబ ! తవాంఘ్రి పల్లవ యుగం – సంస్థాప్య సంవిత్ఫలం, సత్త్వం మంత్ర ముదీరయన్ నిజ శరీరాగార శుద్ధిం వహన పుణ్యాహం ప్రకటీకరోమి రుచిరం – కల్యాణ మాపాదయన్ !!

– ఆదిశంకరుల శివానందలహరి నుండి...

**విశేషం – పుణ్యాహావాచనం :**

ఇది యొక శుద్ధికర్మ. ఇది చేసేటప్పుడు కలశము పెట్టి, దానికి దారము చుట్టి కలశములో నీళ్ళు పోసి మామిడి చిగుళ్ళూ, కొబ్బరికాయనూ దానిపై యుంచి మంత్రములు చదువుతూ, ఆ నీటితో గృహమును శుద్ధిచేసి, మంగళాన్ని పొందుతారు.

**తాత్పర్యము :**

ఓ సాంబమూర్తీ! శివా! నేను భక్తుడనై నా శరీరము అనే గృహాన్ని నిర్దుష్టంగా శుద్ధి చేసుకొని, మనస్సునకు ఇష్టమైన మంగళమును చేయడానికి పూనుకొని, దానికొఱకై భక్తి అనే నూలుపోగులను చుట్టి, సంతోషము అనే నీటితో నింపిన నామనస్సు అనే కలశంలో నీ పాదములనే చిగుళ్ళనూ, జ్ఞానము అనే కొబ్బరి కాయను ఉంచి, కలశస్థాపనము చేసి, సత్త్వగుణ రూపమైన తారకమంత్రాన్ని ఉచ్చరిస్తూ, పుణ్యాహావాచనమును నెరవేరుస్తాను. (అన్నివేళలా మీ పాదపద్మములను స్మరిస్తానని భావం).

**వివరణ:**

సామాన్యంగా మైలగానీ, పురుడుగానీ వచ్చి, ఇల్లూ ఇంట్లోని వారూ, అశౌచంగా వుంటే, శుద్ధి రోజున తప్పకుండా గణపతి పూజతోపాటు పుణ్యాహావాచనం చేసి ఆ కలశాలలోని పవిత్ర జలాన్ని ఇల్లంతా చల్లాలి. ఇంటిలోని వారి శిరస్సులపైనా చల్లాలి. అప్పుడు ఆ ఇల్లూ ఇంటి యజమానీ, ఇంటిలోనివారూ నిర్మలులవుతారు. అలాగే భక్తుల హృదయాలు అరిషడ్వర్గాలతో, అసూయాద్వేషాలతో, అపవిత్ర కార్యక్రమాలతో మలినములైనపుడు ఏ విధంగా వారు తమ దేహాలను శుద్ధి చేసుకోవాలో ఈ శ్లోకంలో శంకరులు చెప్పారు.

శంకరులు ఇలా చెప్పారు. ఓ ఈశ్వరా! నా శరీరం పాడుపడిన కొంప. దానిని శుద్ధి చేసుకోవాలి. తరువాత కల్యాణాన్ని చక్కగా సంపాదించాలి. దానికై పుణ్యాహం అనే శుద్ధి కర్మను చేసుకోవాలి. పుణ్యాహావాచన కర్మకు కావలసిన సామగ్రిని నేను ఇలా సంపాదించుకుంటాను. ముందుగా కలశ స్థాపన చెయ్యాలి, నామనస్సే ఆ కలశం. నామనస్సనే కలశం ప్రసన్నంగా స్వచ్ఛంగా వుంది. కలశానికి దారాలు చుట్టాలి. నేను నాభక్తి అనే దారాలు ఆ కలశానికి చుడతాను. నా సంతోష మనే నీటితో కలశాన్ని నింపుతాను. కలశంలో లేత మామిడి చిగుళ్ళు వేయాలి కదా! నీ పాదపద్మాలే నాకు దొరికిన ఆ చిగుళ్ళు. అందుచేత నామనస్సనే కలశంలో ఈశ్వరా! నీ పాదాలనే చిగుళ్ళను వేస్తాను. ఇంక కలశంపై ఒక ఫలం ఉంచాలి. నేను జ్ఞానం అనే కొబ్బరికాయను కలశంపై ఉంచుతాను. తరువాత మంత్రాలు చదవాలి. నేను సత్త్వగుణ ప్రధానమైన తారకమంత్రాన్ని చదువుతాను. ఈ పుణ్యాహావాచనం వల్ల నా శరీరమూ, మనస్సూ, వాక్కూ పవిత్రమవుతాయి.

ఉజ్జయినీ మహాకాలుని పంచామృత అభిషేకం

మనం కూడా మనశరీర శుద్ధి, ఇలాగే ఈశ్వర పాద ద్వంద్వాన్ని మన చిత్తంలో నిలిపి వాక్కుతో శివనామాన్ని జపించాలని ఈ శ్లోకం ద్వారా శంకరులు మనకు సూచించారని మనం గ్రహించాలి, ఆచరించాలి.

**జై శ్రీమన్నారాయణ**






## నోబెల్ పురస్కా ర గ్రహీత రబీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన ఒక అందమైన ఆంగ్ల కవిత

*నేను మరణిస్తే,*
*నువ్వు కంటతడి పెడతావు,*
*కానీ అప్పుడు నాకది తెలియదు.*
*అందుకని ఇప్పుడే నాతో కలిసి కంటతడి పెట్టు.*

*అప్పుడు నువ్వు పూలు పంపిస్తావు,*
*కానీ అప్పుడు నాకది తెలియదు.*
*అందువల్ల అవేవో అప్పుడు పంపు.*

*అప్పుడు నన్ను మెచ్చుకుంటూ మాట్లాడతావు.*
*కానీ అప్పుడునాకది వినబడదు.*
*అందుకని నన్ను ఇప్పుడే మెచ్చుకో.*

*నా తప్పుల్ను క్షమిస్తావు,*
*కానీ అప్పుడు నాకది తెలియదు...*
*అందువల్ల నా తప్పుల్ను ఇప్పుడే క్షమించు.*

*నేను లేనని బాధపడతావు,*
*కానీ నాకా బాధ తెలియదు.*
*అందుకని నన్ను ఇప్పుడే తలచుకో.*

*నాతో మరింత సమయం గడిపుండాలనుకుంటాడు.*
*అదేదో ఇప్పుడే గడుపు.*
*నా మరణవార్త విని, పరామర్శకు మా ఇంటిని వెతుక్కుంటూ వస్తావు,*
*కానీ నేనుండగా మనమిద్దరం మాట్లాడుకొని ఎన్నో సంవత్సరాలయ్యాయి.*

*నన్ను ఇప్పుడు చూడు, నా మాట ఇప్పుడు విను, ఇప్పుడే జవాబివ్వు.*
*మనుషులతో ఇప్పుడే సమయం గడిపి, నీకు చేతనైన రీతిలో వాళ్ళను సంతోషపెట్టు...*
*నీ కుటుంబాన్నీ, స్నేహితుల్నీ, పరిచయస్థులీ.*
*వాళ్ళు నీకు ప్రత్యేకులని చూపు, ఎందుకంటే కాలం వాళ్ళను నీనుంచి శాశ్వతంగా ఎప్పుడు తీసుకెళ్ళిపోతుందో తెలియదు.*

*ఒక్కణ్ణే ఉంటే 'చెప్పచ్చు', కానీ కలిస్తే 'మాట్లాడచ్చు'.*
*ఒంటరిగా 'ఆస్వాదించవచ్చు', కానీ కలిస్తే 'సంబరం' జరుపుకోవచ్చు.*
*ఒక్కణ్ణే అయితే 'చిరునవ్వు' నవ్వవచ్చు, అందరముంటే 'పండుగే'.*

*అదే మానవ సంబంధాలకున్న అందం.*
*ఒకరు లేకుండా ఇంకొకరు ఉంటే అందం లేదు.*
*అందుకని కలిసి ఉండండి!*
*నేను దేవుణ్ణి ప్రేమిస్తాననడంలో గర్విస్తున్నాను,*
*ఆ దేవుణ్ణే నీలో చూసుకుంటాను, నీలోనే, నీలోనే చూసుకుంటాను.*

(తెలుగు అనువాదం: బి.నవీన, చెన్నై)


*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

# బహుభాషా వేత్తృత్వం భారతీయులకు అయాచితవరం! ప్రతి మనిషికీ మాతృభాషాధ్యయనం అవసరం!

ప్రతి వ్యక్తికీ బహిరంగ జీవితం, అంతరంగ జీవితం– తప్పనిసరిగా ఉంటాయి. ఇవి పరస్పరం ప్రభావితం చేసుకొంటూ ఉంటాయి. వీటి అనుబంధం చాలా చిత్రంగా ఉంటుంది. ఇవి ఒకప్పుడు పరస్పర పరిపోషకాలు, మరొకప్పుడు పరస్పర విధ్వంసకాలు. ఏమైతేనేమి, ఇవి రెండూ ఉన్నాయి అనడం వరకూ ఇప్పటికి చాలు. అయితే బహిరంగ జీవితం అంతా ఒకటి కాదు. కుటుంబ సభ్యులతో జరిపే వ్యవహారం, ఇరుగు పొరుగు సమాజంతో జరిపే వ్యవహారం– ఇలా ఇందులో చాలా అంతరువులు ఉంటాయి. ప్రాంతీయ భాషలు బలంగా వర్ధిల్లిన మన దేశంలో పుట్టిన ఒక వ్యక్తికి ఈ బహిరంగ జీవిత వ్యవహారంలో వైవిధ్యం చాలా ఉంటుంది. తెలుగు మాతృభాషగా కల వ్యక్తి ఉద్యోగమో, వ్యాపారమో కారణంగా గుజరాతులో సకుటుంబంగా స్థిరపడవలసివస్తే, అతడి బహిరంగ జీవిత వ్యవహారాల కోసం కనిష్ఠ పక్షం మూడు నాలుగు భాషలు అవసరమౌతాయి, కుటుంబ సభ్యులతో వ్యవహారానికి తెలుగు, ఇరుగుపొరుగులతో వ్యవహారానికి గుజరాతీ, తనలాగే మరోరాష్ట్రం నుంచి వచ్చి స్థిరపడిన సహచరులతో వ్యవహారానికీ హిందీ, మిగతా ప్రపంచంతో అనుబంధానికి ఆంగ్లం తప్పనిసరిగా అవసరమవుతున్నాయి. భాషలేకుండా ఏ వ్యవహారమూ సాగదు కనక బహుభాష వేత్తృత్వమనేది భారతీయులకి ఇలా అయాచిత వరంగా సంక్రమిస్తోంది. వాస్తవ పరిస్థితి ఇలా ఉండగా, మన రాష్ట్రంలో ఆంగ్ల భాషా మాధ్యమంలో విద్యాభ్యాసమనేది మహమ్మారిలా వ్యాపిస్తోంది. మొన్నటి దాకా పట్టణాలకూ, సంపన్న కుటుంబాలకూ పరిమితమైన ఈ వ్యాధి ఇప్పుడు పల్లెసీమలకు కూడా పాకింది. చేరువలో ఉన్న కాన్వెంటులో విద్యాభ్యాసమైతే అట్టే ప్రమాదం లేదు. అందులో బోధకులు కేరళీయులో, ఆంగ్లో ఇండియనులో అయినా పరిసరాల అవసరాలు మాతృభాషను పలికిస్తాయి కనక విద్యార్థికి రెండు భాషాలూ వస్తాయి. అలాకాక ఎక్కడో మరో రాష్ట్రంలో, పేరుపడ్డ కాన్వెంటులో తెలుగు బిడ్డను చేర్పిస్తే ఆ బిడ్డ మాతృభాషకూ, ఇంగ్లీషు రాని తన తల్లిదండ్రులకూ, కుటుంబసభ్యులకూ ప్రాంతీయ సంస్కృతికీ దూరమవుతాడు. ఏ సెలవులకో ఇంటికి వచ్చినా తనవారి మధ్యనే తానొక పరాయివాడు అవుతున్నాడు. గోళీలు ఆడటం, చెరువులలో ఈదడం, దొంగతనంగా జామకాయలు కోయడం, జాతరలకు పోవడం వగైరా వగైరా బాల్య సౌందర్యాలూ, మైత్రీ మాధుర్యాలూ అతడికి కరువైపోతున్నాయి. ఎదిగేకొద్దీ, వ్యక్తిగానే కాదు సంస్కృతి పరంగా కూడా అతడొక ద్వీపం అవుతున్నాడు. విదేశీ తెలుగు కుటుంబంలో పెరిగి ఆ దేశంలోనే చదువుతున్న వారికీ ఇతడికీ అట్టే తేడా లేదు. మేధావిగా, సాంకేతిక విద్యావేత్తగా ఇతడు ప్రపంచ పౌరుడు అయితే కావచ్చునుగానీ, తెలుగు నేత తల్లితో సంబంధం లేకుండా గుక్కెడు సీసాలో కళకళలాడుతున్న మనీప్లాంటులా కనిపిస్తాడు. ఒంటరితనం వల్ల వచ్చే అనర్థాలన్నీ ఇతడికీ ఇతడి నుంచి సమాజానికీ సంక్రమిస్తాయి. ఇతడి నుంచి మేధా విలసనం తప్ప మరింకేదీ మాతృసమాజానికి అందదు. అన్యభాషా మాధ్యమంలో విద్యాభ్యాసాల పెరుగుదలకూ మాతృభాషలో సృజనాత్మక రచనల తరుగుదలకూ ఏదో ఒక నిష్పత్తిలో కార్యకారణ సంబంధం ఉన్నదని భాషా శాస్త్రవేత్తలందరూ ముక్తకంఠంతో చెబుతున్నారు. దీనిని గమనించవలసిన అవసరం మనకి లేదు అనుకోవడం పొరపాటు.

ఒక్కటే భాష ఒక్కటే మతమూ ఒక్కటే సంస్కృతి ఉన్న చిన్న చిన్న దేశాలు ఆర్థిక సాంకేతిక రంగాలలో సాధించిన ప్రగతి మనకు సాంస్కృతిక రంగంలో కూడా ఆదర్శం కావడం దురదృష్టం. పోనీ అంటే, ప్రాంతీయ భాషా సాహిత్యాలకు ఒక సమిష్టి రూపంగా దేశీయ భాషా సాహిత్యాలను మనం రూపొందించుకో గలిగామా అంటే అదీ లేదు. ఒకప్పుడున్న సంస్కృతాన్ని బుట్టదాఖలా చేసామే తప్ప, ప్రత్యామ్నాయాన్ని గురించి పట్టించుకోలేదు. ఇదీ ఒకందుకు మంచిదే అయ్యింది. కేవల భిన్నత్వంలాగానే కేవల ఏకత్వమూ అనర్థ దాయకమే. భిన్నత్వంలో ఏకత్వమే జీవితాన్ని రుచిమంతం చేస్తుంది. దీనిని కూడా మనం పోగొట్టుకో బోతున్నామా, ప్రపంచీకరణ పేరుతో మూసకట్టు సమాజమనే కొరివితో తలగోక్కోబోతున్నామా అనేది ప్రస్తుతం మనల్ని పట్టి పీడిస్తున్న సమస్య. ఆర్థికరంగంలో ప్రగతికి ప్రపంచీకరణ అవసరమైతే కావచ్చు. కానీ దీనికీ కొన్ని పరిమితులున్నాయి. ముఖ్యంగా కళా సాంస్కృతిక రంగాలలో దీన్ని ప్రవేశాన్ని అడ్డుకోవాలి. అడ్డుకోకుండా దీని కబళింతను కళ్ళప్పగించి చూస్తూ నిలబడితే – దేశాలు, ప్రాంతాల వ్యక్తిత్వాలు అంతరించి భూగోళమంతా చైతన్యరహిత వ్యష్టిద్వీపాల సముదాయంగా మారి పోతుంది. అప్పుడు మరొక కమ్యూనికేషన్ వ్యవస్థను రూపొందించుకోవలసి వస్తుంది. ఈ ప్రమాదాన్ని వారించడంలో మొదటి అడుగు–ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధనలకు, కనీసం ఉన్నత పాఠశాలా స్థాయి వరకూ అడ్డుకట్ట వేయడమే.

భిన్నత్వ పరిరక్షణకు మాతృభాష, ఏకత్వ సాధనకు జాతీయ భాష, అంతర్జాతీయావసరాలకు ఆంగ్లభాష – ఇలా ఒకప్పటి త్రిభాషా సూత్రానికి విద్యారంగంలో ఏ మినహాయింపులూ లేని నిర్బంధత కల్పించి తీరవలసిన తరుణం ఆసన్నమయ్యింది. అక్షరాభ్యాసం మొదలుకొని పిహెచ్‌డి పట్టం వరకూ ఎక్కడా మాతృభాషా సాహిత్యాలను చదవకుండా డిగ్రీలు పుచ్చుకొని తుర్రుమనే అవకాశం ఒక్క మన దేశంలోనే, అదీ మన రాష్ట్రంలో మాత్రమే ఉంది అంటే ఎవ్వరూ ఆశ్చర్యపడవలసిన పనిలేదు. త్రిభాషా సూత్రం అమలులో ఎదురయ్యే సమస్యలకూ, సమసాభాసాలకూ పరిష్కారాలు ఆలోచించాలే తప్ప ప్రాంతీయ భాషా పరిత్యాగమే అన్నింటికీ మంత్ర మనడం సరికాదు.


బహిరంగ జీవితంలో అంతరువులున్నట్టే అంతరంగ జీవితంలోనూ చాలా అంతరువులున్నాయి. సృజనశీలత, ఆధ్యాత్మికత అనేవి వాటిలో ప్రధానమైనవి. కళారూపాల సృష్టికర్తకే ఆస్వాదనకూ సృజనశీలత అవసరమే. అంతరంగాన్ని అనుభూతి పేటిక అన్నారు. కుటుంబం, మిత్రబృందం, పరిసరాలు – ప్రధానంగా ఇవీ అనుభూతుల ఉత్పాదకకేంద్రాలు. ఆశ్చర్యమేమంటే – అనుభూతులు అంతరంగంలో ముద్రితమయ్యేది మాతృభాషలోనేనట. మాతృభాషనూ, అనుభూతినీ విడదీయడం రూపాయనీ ఒకటినీ విడదీయడమంత కష్టమన్నారు. దృష్టాంతం సరిపోలేదేమో కానీ ఇవి అవిభాజ్యాలనడం నా తాత్పర్యం. మాతృభాషకు దూరమైన నాడు మనోధర్మాలైన అనుభూతులకు చేరువ కాలేడు. అనుభూతులకు నోచుకోని అంతరంగం కళారూపాలను సృష్టించలేదు, ఆస్వాదించలేదు. ఈ రెండింటిలో ఏ ఒక్కటీ చెయ్యలేని మనిషిలో సాత్త్వికత కనిపించదు. ఇది తాత్త్వికులు చెప్పే సాత్త్వికత కాదు, అలంకారికులు చెప్పిన సాత్త్వికత. ఇది లేనివాడు అణువణువునా మహా విజ్ఞానఖని కావచ్చునేమో కానీ మానవతా స్పందనలు అతడిలో ఉండవు. ఈ మానవతా స్పందనల సమాహారమే కదా సంస్కృతి!

సిసలైన సంస్కృతికీ, అనుభూతులకూ, ఆధ్యాత్మికతలకూ దూరమైన మనిషి ఏమవుతాడు? అతడివల్ల లాభమా? నష్టమా? ఎవరికి? ఏమేరనే? మొదలైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం ఒకరకంగా చాలా తేలిక, ఒకరకంగా చాలా కష్టం ఈ సృష్టిలో ఏదీ ఒక సూత్రానికి లొంగదనే వాస్తవాన్ని మనం మరచిపోకూడదు. కానీ ఒకటిమాత్రం నిజం – అటువంటి మనిషి అపరిపూర్ణుడుగా మిగిలిపోతూ, 'అర్ధాకలితో' జీవిస్తాడు.

అందుచేత బహిరంగ జీవితంలో ఏకాకితనాన్ని వదలగొట్టాలన్నా, అంతరంగ జీవితంలో పరిపూర్ణుణ్ణి చేయాలన్నా ప్రతి మనిషికీ మాతృభాషా సాహిత్యాల అధ్యయనం మినహా గత్యంతరం లేదని నా అభిప్రాయం. దీనికి మీరూ సమ్మతించి నట్టయితే ఈ చర్చాసదస్సుకు సారాంశంగా ఒక తీర్మానం చేసి డబ్ల్యూటిఎఫ్‌ద్వారా మన ప్రభుత్వానికి సమర్పించడం సమంజసంగా ఉంటుందని నా విజ్ఞప్తి. మన రాష్ట్రంలో కనీసం ఇంటర్మీడియట్ స్థాయి వరకునైనా తెలుగు భాషా సాహిత్యల అధ్యయనాన్ని నిర్బంధం చెయ్యాలి. తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు ఇది అత్యావశ్యకమని భావించి, ఈ విజ్ఞప్తిని వెంటనే అమలుపరిచే చర్యలు చేపట్ట వలసిందిగా రాష్ట్రప్రభుత్వాన్ని కోరడమైనది.


(చతుర్ధ ప్రపంచ తెలుగు మహాసభలందు సమర్పించిన పత్ర సారాంశం!)

– శ్రీ బేతవోలు రామబ్రహ్మం



# వేద విద్యా కోవిదుడు ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రి నూరు వసంతాలు జీవించారు!

సంజీవ శరదశ్శతమ్' – అన్నారు వేద విజ్ఞానకోవిదులు. వేదం అభ్యసించి, నూరు వసంతములు జీవించినవారిని 'పూర్ణ పురుషులు' అనవచ్చు. కళాపూర్ణులూ అనవచ్చు. వేదములు రుచ్యం కావాలంటే సంస్కృతాభ్యాసనం చేసి తీరాలి. వారికి సంస్కృతీ అలవడుతుంది, సాహితీ సృజనత్వమూ కలుగుతుంది. అలాటి వేద ఘనాపాటీ లెందరో పుట్టిన పుణ్యసీమ గోదావరీ పరివాహిక ప్రాంతమైన తూర్పుగోదావరీ జిల్లా. కోనసీమ విజ్ఞానఖనిగా పేరొందిన ఖండవిల్లి సూర్యనారాయణ శాస్త్రిగారిని గురించెరింగిన వారు చాలా అరుదు.



1993వ సం॥ములో అప్పటి రాష్ట్రపతి, బహుముఖ కోవిదుడూ, భారతీయ సంస్కృతిని మూర్తీభవింపచేసుకున్న రాజకీయ సుజ్ఞాని శ్రీ శంకరదయాళ్ శర్మ – వీరి వేద విజ్ఞాన ప్రతిభను గుర్తించి, రాష్ట్రపతి భవనంలో సన్మానించారు. ఇతఃపూర్వం పుంభావ సరస్వతులైన ఉప్పులూరి గణపతి శాస్త్రిగారు 'వేద విద్యా విశారద' యని ప్రస్తుతిస్తూ, బిరుద ప్రదానంతో గౌరవించారు. అంతకు పూర్వం 1966లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి, మహోపాధ్యాయ కాశీ కృష్ణమాచార్యులు గారు 'కాళిదాస రహస్య సర్వాభిజ్ఞా – ప్రామాణిక విమర్శకాగ్రేసర' బిరుదుతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఇలా ఎందరో విద్వద్మణులు, భాషా సాహిత్య రంగ వేత్తలు సూర్యనారాయణశాస్త్రిగారిని గౌరవించడం జరిగింది.

శాస్త్రిగారు సులభగ్రాహ్యంగానూ, కరతలామలకంగా ఉండేట్టుగా 'రత్నవిఫణి' అనే గ్రంథాన్ని రచించారు. ఆ గ్రంథంలో ఐశ్వర్యవంతులూ, ఆరోగ్యవంతులూ, విద్యావిజ్ఞానవంతులు కావడానికి ఆరు దోషాలను విడనాడాలన్నారు.

1. తరచుగా నిద్రించుట
2. ప్రతీ కార్యములోనూ తొందరపడుట
3. త్వరగా భీతి చెందుట
4. అనాలోచితంగా క్రోధవశుడుగుట
5. ప్రతీ పనినందూ జాప్యం చేయుట
6. సోమరిపోతుతనము

– ఈ ఆరు దుర్గుణములూ మానవుని ప్రగతికీ, ప్రతిభకూ, శ్రేయస్సుకూ ప్రతిబంధకములన్నారు. వీటిని దరిచేరనీయని వారే – ఏకార్యమునైనా సాధించగలరనీ, ఐశ్వర్యవంతులు కాగలరనీ, ఆనందం వారి స్వాధీనంలో ఉంటోందని వాక్రుచ్చారు. ఇలా ఉన్నతమైన అభివ్యక్తిత్వానికి అనేక విషయాలను 'రత్నవిఫణి'లో ప్రతిబోధించారు. సంస్కృత శ్లోకాలకు చక్కటి వ్యాఖ్యానము చేశారు.

వీరెన్నో పరిశోధనా గ్రంథములను రచించారు. వీరి కలం నుంచీ వెలువడు కాళిదాస హృదయం, భక్తపోతన మహాభాగవత రచన, హైందవ ధర్మామృతం, కాళిదాస కావ్య సౌరభం, శ్రీ జగన్నాథ పండిత జీవిత చరిత్ర గ్రంథములు అనేక విశ్వవిద్యాలయముల్లో బోధనా గ్రంథాలుగా చేయడం జరిగింది. వీరి కాళిదాస, జగన్నాథ పండితరాయల గ్రంథాలపై ఎందరెందరో పరిశోధనలు చేసి, డాక్టరేట్ పొందారు. వీరు సంస్కృతాంధ్ర ఉభయ భాషల్లోనూ పాండిత్య ప్రతిభను కనబరిచారు.

శ్రీ శాస్త్రిగారు చిన్నతనంనుంచే వేదాధ్యయనం వివిధ కావ్యశాస్త్రాల అధ్యయనం చేస్తూ వచ్చారు. తనకెంతో తెలిసినపప్పటికినీ, ఏమీ తెలియనట్టుగా ఎందరెందరో పండితుల వద్ద అభ్యాసనం చేస్తూ ఎన్నెన్నో విషయాలను కూలంకషంగా గ్రహించేవారు; నిరంతర నిర్విరామ అధ్యయనం చేసేవారు. నారాయణమూర్తి అవధాని గారి వద్ద కృష్ణ యజుర్వేదాధ్యయనం, తండ్రి శ్రీరామమూర్తి శాస్త్రిగారి వద్ద శాస్త్ర కావ్యములూ, మహీధర వెంకట్రామ శాస్త్రిగారి వద్దనూ, పుల్ల ఉమామహేశ్వర శాస్త్రిగారి వద్ద వ్యాకరణం, ఆచార్య కోదాడ రామకృష్ణయ్య గారి వద్ద తెలుగు సాహిత్యం, పరిశోధనా వ్యాసంగమును అభ్యసించారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో 'విద్వాన్' పట్టం అందుకున్నారు. అనేకానేక పాఠశాలల్లో తెలుగు పండితులుగా పనిచేశారు.

సంస్కృత భాషను ఎందుకు నేర్చుకోవాలీ అంటూ – భారతీయుల అమూల్య సాహితీ సంపద, విజ్ఞానం, శాస్త్రం అంతా సంస్కృతంలోనే ఉన్నదనీ, సంగీతం వంటి కళలు సహితమూ సంస్కృతం నుంచే ఉద్భవించాయనీ, భారతీయ ఆర్యధర్మమూ, ఆగమ శాస్త్రమూ, ప్రకృతి శాస్త్రమూ, భౌతిక శాస్త్రమూ యావత్తూ సంస్కృతములోనే ఉన్నాయంటూ, అపార సంపద, అపార ఐశ్వర్యంగల సంస్కృతాధ్యయనం బహుప్రయోజనకరమైనదని చెప్పారు. 'భారతీయ విద్యానికేతన్' ద్వారా సంస్కృత బోధన, తరగతులను నిర్వహించారు. ఎందరికో సంస్కృతాంధ్రములను నేర్పారు.

శ్రీ శాస్త్రిగారు తూర్పు గోదావరి జిల్లా ముంగండ గ్రామంలో 1914 సంవత్సరం మార్చి 27న, ఖండవల్లి శ్రీరామమూర్తి, కామేశ్వరమ్మల పుత్రరత్నంగా జన్మించారు. శాస్త్రిగారిది పూర్ణ జీవితమనే చెప్పాలి. తిరుమల తిరుపతి దేవస్థానం వారు వీరి వేదవిజ్ఞాన గరిమను గుర్తించి గౌరవ వేతనం పంపించేవారు. కోనసీమ నుంచీ ఉత్తరాదికీ వీరి పేరు ప్రఖ్యాతులు సూర్యకిరణముల్లా చొరబడ్డాయ్. వీరికి అయిదుగురు మగపిల్లలు, ఏడుగురు ఆడపిల్లలు. అధిక మాసాలతో కలుపుకుంటూ వీరు నిండునూరేండ్లూ జీవించారు.

ఎందరో సంస్కృతాంధ్ర పండితులూ, ఉభయ భాషా కోవిదులూ ఐన్నప్పటికినీ, వీరి పాండిత్యం పరిశోధనాత్మకమైనది, సులభగ్రాహ్యమైనది. ఇలాటి పండితులకు రాగల ప్రచారమూ, ప్రాచుర్యతా రానందుకు విచారిస్తున్నాం. ఈ సూర్యనారాయణుడు సాహితీ సూర్యనారాయణుడనే చెప్పవచ్చు. ●

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*





# అరుదైన నృసింహ క్షేత్రం
# నీర నర్సింగపూర్

పూణే జిల్లాలో 'ఇందాపూర్' తాలూకాకు 35 కిలోమీటర్ల దూరంలో ఈ 'నీర నర్సింగపూర్' క్షేత్రం ఉంది. పూనా జిల్లాలో ఈశాన్యం వైపు ఉన్న చిట్టచివరి గ్రామమిది. ఈ అందమైన గ్రామంలో రెండు నదులు పారుతూ ఉంటాయి. ఒక ప్రక్క నుంచి 'నీరా' నది వస్తుంది. మరొక పక్క నుంచి 'భీమా' నది వచ్చి, సరిగ్గా శ్రీలక్ష్మి నృసింహ స్వామి ఆలయం వెనుక భాగంలో నీరా నదితో సంగమిస్తుంది.

మహారాష్ట్రకు, ఇంకా మధ్యప్రదేశ్ కర్ణాటక ఆంధ్ర ప్రదేశ్ వంటి అనేక చుట్టుపక్కల రాష్ట్రాలకు చెందిన చాలా మందికి ఈ స్వామి వారు కుల దైవం. ఈ ప్రాంతానికి కేవలం స్వామి వారిని చూడడానికి, ఈ మహిమాన్వితమైన క్షేత్రంలోని ప్రశాంతతను అనుభూతి చెందడానికి చాలా మంది వస్తుంటారు. స్వామివారి కృప తో ప్రశాంతమైన సుసంపన్నమైన జీవితాన్ని గడపగలమని భక్తుల నమ్మకం.

నీర నర్సింగపూర్ ప్రాంతానికి శాస్త్రీయమైన ప్రాధాన్యత కూడా ఉంది. శాస్త్రవేత్తలు ఈ ప్రాంతాన్ని గురించి పరిశోధించి, ఈ ప్రదేశం భూమి యొక్క మధ్య భాగమని, రుజువులతో సహా నిరూపిస్తూ చెబుతారు. అందువల్ల కూడా అనేక మంది యాత్రికులు ఈ క్షేత్రాన్ని దర్శిస్తూ ఉంటారు.

## చరిత్ర:

ఈ ప్రాంతానికి చాలా సుదీర్ఘమైన చరిత్ర ఉంది. పద్మపురాణంలోని 12 వ అధ్యాయంలో ఈ ఆలయ ప్రాధాన్యతను గురించిన ప్రస్తావన ఉంది. పురాణకాలంలో కూడా ఇది అత్యంత పవిత్రమైన క్షేత్రంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. రావణ సంహారం జరిగిన తర్వాత శ్రీరామచంద్ర ప్రభువు అనేక పుణ్య క్షేత్రాలను దర్శించారు. అగస్త్యముని తీర్థ యాత్రలను పూర్తి చేయమని సూచించడంతో, శ్రీరామచంద్రుడు నీర–నర్సింగపూర్ నుంచే తన యాత్రను ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు.

ఇది చాలా సుందరమైన ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో, అనేక మంది మునులు, భక్తులు ఇక్కడికి తపస్సు కోసం వచ్చేవారు. వేదవ్యాసుడు కూడా ఇక్కడ కొంతకాలం నివసించారు. విజయనగర సామ్రాట్టుల కులదైవం ఈ స్వామి వారు, అందుకే ఈ ఆలయాన్ని వారు ఎంతో భద్రంగా చూసుకున్నారు. "సమర్థ రామదాస స్వామి" తన అనుచరులతో కలిసి, పండరీపురం నుంచి పాలి వైపుగా వెళ్తూ, రెండుసార్లు ఈ ప్రాంతాన్ని 1553 వ సం. దరిదాపుల్లో సందర్శించారని చెప్పడానికి బలమైన ఆధారాలు ఉన్నాయి. ఆ సమయంలో ఆయన ఇక్కడికి వచ్చి పూజలు జరిపారు.

నీరా, భీమా నదుల సంగమంలో ఉన్న ఘాట్ రోడ్డును 1527 లో పూర్తి చేసారు. కోడిగుడ్డు ఆకారంలో ఉన్న ఈ రోడ్డును, మూడేళ్ల పాటు అత్యంత ప్రయాస కోర్చి 'త్రిమలపాల్ దాదాజి మొధోజి' నిర్మించారు. 1787 వ సం.లో రఘునాథరావు వించుర్కర్ ఈ అందమైన ఆలయాన్ని పునరుద్ధరించారు.

## నృసింహ ఆలయ విశేషాలు

ఇక్కడి నృసింహ స్వామి ఆలయం చాలా పెద్దగా, ఘనంగా, ఒకకోటలా ఉంటుంది. నేల మట్టానికి, గ్రామంలోని ఇళ్లకు చాలా ఎత్తులో ఉంటుంది. పేష్వాల కాలంనాటి అద్భుతమైన నిర్మాణ శైలికి తార్కాణంగా ఈ ఆలయం నిలుస్తుంది. ఆలయం చుట్టూ బలమైన కోట గోడలు ఉంటాయి. ఈ ఆలయం మొత్తమూ, గర్భగుడితో సహా నల్ల రాతితో నిర్మించబడింది.

అంతరాలయంలో రెండు నృసింహ విగ్రహాలు ఉంటాయి. మొదటిది ప్రహ్లాదుని చే ఇసుకతో చేయబడ్డది. రెండవది బ్రహ్మదేవునిచే స్వయంగా చేయబడ్డది. రాతితో చేయబడ్డ ఈ విగ్రహాన్ని 'శ్యామ్ రాజ్' అని పిలుస్తారు.

## భక్త ప్రహ్లాదుడు

హిరణ్యకశిపుని భార్య అయిన కాయదు, ఈ నీర నర్సింగపూర్ వద్ద భీమానది ఒడ్డున ఉన్న నారద ఆశ్రమంలోనే ప్రహ్లాదుడికి జన్మనిచ్చిందని చెబుతారు.

నారదుని ఉపదేశం వల్ల హరిభక్తి బాగా పాదుకొన్న ప్రహ్లాదుడు, ప్రతిరోజు నీరా – భీమా నదుల సంగమం వద్ద, ఇసుకతో నృసింహ స్వామి విగ్రహాన్ని చేసి, ఆరాధించేవాడు. ఆ తర్వాత ప్రహ్లాదుని కోరికపై, స్వామివారు భక్తులను అనుగ్రహించేందుకు ఈ క్షేత్రంలో వెలిసారట.

ప్రహ్లాదుడు ఇసుకతో చేసిన ఆ విగ్రహమే నేడు గర్భగుడిలో సింహాసనంపై ప్రతిష్ఠించి ఉండడాన్ని చూడవచ్చు. స్వామివారు పశ్చిమాభిముఖంగా, పద్మాసనంలో కూర్చుని ఉంటారు. స్వామి వారి కుడి చెయ్యి కుడి తొడపై ఉండగా ఎడమ చేయి నడుము మీద ఆన్చి ఉంటుంది. సింహ ముఖంతో విశాలమైన ఛాతీ తో కళ్ళతో స్వామివారు మనకి ఇక్కడ దర్శనమిస్తారు.

## శిల్ప సౌందర్యం

ఎటువంటి రవాణా సౌకర్యాలు లేని కాలంలో, ఇటువంటి ఘనమైన ఆలయాన్ని ఇలా నిర్మించారా అని, ఇక్కడ అడుగుపెట్టిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్య పోయేలా ఆలయ నిర్మాణ శైలి ఉంటుంది. ఆలయంలో రాతిపై, చెక్కపై చెక్కిన శిల్పాలు అబ్బురపరుస్తాయి.

రాతి స్తంభాల నిర్మాణం కూడా చాలా ప్రత్యేకంగా ఉంటుంది. అందమైన శిల్పాలు ఆలయ సౌందర్యాన్ని ఇనుమడింప చేస్తాయి. ఈ ఆలయానికి తూర్పు, ఉత్తరం, పశ్చిమ దిశల్లో మూడు ప్రధాన ద్వారాలు ఉన్నాయి. తూర్పు పశ్చిమ దిశల్లో ఉన్న రెండు పెద్ద ఏనుగులు యాత్రికులను ఆకర్షించే విధంగా ఉండి, స్వాగతిస్తున్నట్లుగా ఉంటాయి.

పశ్చిమ దిశలో ఉన్న ద్వారం చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఆలయాన్ని చేరుకోవడానికి 33 మెట్లు ఉంటాయి. ప్రధాన నిర్మాణం పూణేలో ఉన్న 'శనివార్ వాడా'ను పోలి ఉంటుంది. పడమటి ద్వారానికి ముందరే నీరా నది పారుతూ ఉంటుంది. సూర్యాస్తమయ వేళలో లక్ష్మీ ఘాట్, నరసింహ తీర్థం మనోజ్ఞంగా ఉంటాయి.

## పండుగలు:

మాసానుగుణంగా జరిగే అనేక పండుగలతో పాటు, గుడి పడ్వా(మరాఠి వారి కొత్త సంవత్సరాది), రామనవమి, హనుమజ్జయంతి ప్రధాన పండుగలు. ఇక్కడ జరిగే వైశాఖ నవరాత్రి ఉత్సవం చాలా విశిష్టమైనది. నృసింహ భక్తులంతా ఆ సమయంలో ఇక్కడ పోగై, ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఇంతటి చారిత్రిక ప్రాధాన్యమున్న ఈ క్షేత్రాన్ని తప్పక దర్శించండి.

– భావరాజు పద్మిని

# శాపం కానున్న పెరుగుతున్న భూతాపం

గాలిలో కార్బన్‌డైఆక్సైడ్ పీల్చుకుని చెట్లు ఆక్సిజను విడుదల చేస్తాయి. ఇలాంటి పచ్చని చెట్లు క్రమక్రమంగా భూగోళం మీద తరిగిపోతుంటే మానవాళి మనుగడ ఎలా? ఇటువంటి పరిస్థితిని ఊహించుకుంటేనే భయం వేస్తోంది.

పర్యావరణంగా చెట్లు చేసే మేలు ఎప్పటికీ మరువలేము. భూతాపం జీవరాశి మనుగడకు ఎంతో అవసరం. కాకపోతే ఇది స్థిరంగా ఉండాలి. భూతాపం అదుపు తప్పి పెరగడం మొదలయితే ఎన్నెన్నో ప్రమాదాలు ఎదురవుతాయి. భూమిపైకి వేడి సూర్యుడు నుండి పరారుణ కిరణాల రూపంలో జేరుతోంది. ఈ కిరణాలు భూమిపై పడి తిరిగి పరావర్తనం చెంది అంతరిక్షంలోకి వెళ్లిపోవాలి.

వాతావరణంలో పేరుకుపోయివున్న కార్బన్‌డైఆక్సైడ్ మీథేన్, ఓజోన్, నీటి ఆవిరి వంటి గ్రీన్‌హౌస్ వాయువులు ఈ పరారుణ కిరణాలు అంతరిక్షంలోకి వెళ్లిపోకుండా భూమిమీదగల వాతావరణంలో పట్టి ఉంచుతున్నాయి. నిజానికి ఈ పరారుణ కిరణాలు భూమిపై పరావర్తన అనంతరం అంతరిక్షంలోకి వెళ్లిపోయి ఉంటే భూమి ఉష్ణోగ్రత ప్రస్తుత ఉష్ణోగ్రతకన్నా 30 డిగ్రీల సెలిసియస్ తక్కువ ఉంటుంది. అలా జరిగి ఉంటే భూమి మీద జీవజీలం ఉనికి ప్రశ్నార్థమై ఉండేది.

## పెరుగుతున్న భూతాపం :

ఈ గ్రీన్ హౌస్ వాయువుల వల్ల భూతాపం స్థిరంగా ఉంటోంది. అయితే 19వ శతాబ్దం నుండి ఈ గ్రీన్‌హౌస్ వాయువులు అసహజమైన స్థాయిలో వాతావరణంలో పేరుకుపోవడం వల్ల పరారుణ కిరణాలను మరింత అధికంగా పట్టి ఉంచుతున్నాయి. ఆ కారణంగానే భూతాపం పెరిగిపోతోంది. దీనితో ఎన్నెన్నో సవాళ్ళు ఎదుర్కోవలసిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

ప్రస్తుత రీతిలో భూతాపం పెరుగుదల కొనసాగితే 2100 నాటికి భూమిమీద గల అడవులలో 40 శాతం అడవులు అంతరించి పోతాయని కంప్యూటర్ స్టిమ్యులేటడ్ స్టడీస్ ద్వారా జపాన్ పరిశోధకులు అంచనాలు వేశారు. చనిపోయిన చెట్ల నుండి విడుదలయ్యే కార్బన్‌డైఆక్సైడ్ వల్ల భూమి ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. రాబోయే శతాబ్దం నాటికి భూమి ఉష్ణోగ్రత మూడున్నర డిగ్రీల సెలిసియస్ పెరుగుతుందని కంప్యూటర్లు విశ్లేషించి చెబుతున్నాయి.

ఈ ఉష్ణోగ్రత పెరుగుదల రెండు డిగ్రీలకు తగ్గించగలిగినా ఇరవైఆరు శాతం అడవులు అంతరించిపోతాయి. ముఖ్యంగా ఉత్తర అమెరికా, దక్షిణ ఆమెరికా, భారత్, ఆఫ్రికాదేశాల్లో అడవులకు ఎక్కువ నష్టం వాటిల్లుతుంది.

## వాయువుల ప్రభావం :

కార్బన్‌డైఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ లాంటి విషవాయువులు, క్లోరో ఫ్లోరో కార్బన్స్‌లాంటి విషరసాయనాలు వాతావరణంలో అధికంగా చేరుతుండడం వలన ఇప్పటికే ప్రపంచ ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెలిసియస్ పెరిగిపోయింది.

1980 దశకం నుండి ప్రపంచ చరిత్రలో వరుసగా "అత్యుష్ణ సంవత్సరకాలు"గా ఏ ఏడాది కాఏడాదే నమోదు అవుతున్నాయంటే భూతాపం ఎలా పెరుగుతున్నది అర్థం చేసుకోవచ్చు. 1998 అత్యంత వేడి సంవత్సరంగా నమోదు అయినప్పటికీనీ 2003 సంవత్సరం దానిని అధిగమమించింది.

ఇటీవల సంవత్సరాలన్నీ మండుటెండల సంవత్సరాలుగా నమోదు అయ్యాయి. బొగ్గులాంటి ఇంధనాలు కాల్చడం వల్ల, ఇంకా ప్రకృతిలో సహజసిద్ధంగా ఉత్పత్తి అయ్యే కార్బన్‌డైఆక్సైడ్ వాతావరణంలో సగటున 100 సంవత్సరాల పాటు ఆవిధంగానే ఉండిపోతుంది. అదేవిధంగా మనిషి తయారుచేసి వినియోగిస్తున్న క్లోరోఫ్లోరో కార్బన్ రసాయనాలు కూడా వందేళ్ళు పాటు వాతావరణంలో నిల్వ ఉండి ఆ తరువాత మాత్రమే అదృశ్యమవుతాయి. గత 600 సంవత్సరాలతో పోలిస్తే గత 100 సంవత్సరాలలో భూగోళం వేడెక్కడం అధికమయ్యింది. ముఖ్యంగా గత 10-15 సంవత్సరాలలో మరీ ఎక్కువ అయ్యింది.

## గ్లోబల్ వార్మింగ్ - వ్యాధులు :

నానాటికీ వేడెక్కుతున్న భూగోళం అనేక వ్యాధులకు కారణం అవుతోంది. స్వీడన్‌లో అనేకమంది చావులకు కారణమయిన టి.బి.ఇ. (టిక్ బోర్నో ఎన్‌సెఫలైటీస్) వ్యాధి వ్యాప్తికి కారణం వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగడమే అంటున్నారు. 1970 పడి చివరి రోజుల్లో ప్రతి పదిలక్షల మందిలో పదిమందికి సోకిన ఈ వ్యాధి 1990లో మూడింతలయ్యింది.

స్వీడన్‌లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలవల్ల "ఇక్సోడెస్ రెసినస్" అనే వైరస్ విజృంభిస్తోందని కనుగొన్నారు. ఇది దోమలను ఆశ్రయించి వాటి ద్వారా మనిషి శరీరంలోకి ప్రవేశించి టి.బి.ఇ. (ఒక రకమైన మెదడువాపు వ్యాధి) వ్యాధికి దారితీస్తోంది. అంతేకాదు "స్పైరోబెట్" అనే బ్యాక్టీరియా సైతం తనవంతుగా లైమ్‌డిసీజ్, ఎర్లీబయోసిస్ వంటి వ్యాధులు రెచ్చగొడుతోంది. విషజ్వరం సోకి కండరాలను, కీళ్లను విపరీతంగా బాధిస్తోంది.

మంచులో నిద్రాణ స్థితిలోవున్న వైరస్ గ్లోబల్ వార్మింగ్ వల్ల చేతనాస్థలోకి వచ్చి వ్యాధులు కలిగించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు పరిశోధకులు. పూర్తిగా నిర్మూలమైన పలు ప్రాణాంతంక వ్యాధులు మళ్లీ విజృంభించే అవకాశం ఉందంటున్నారు.

## విలయం అంచున భూగోళం :

* మానవ కార్యకలాపాల వల్ల, పెరిగిపోతున్న భూతాపం వల్ల సముద్రాలు సలసలా కాగిపోతున్నాయి. ప్రకృతి గతి తప్పుతోంది.
* వేసవి ఒక్కటే ఎక్కువకాలం ఉంటోంది. మిగతా సీజన్లు రావలసిన కాలాల్లో రావడం లేదు, వచ్చిన తరువాత ముందుగానే ఆ సీజన్లు ముగిసిపోతున్నాయి.
* ఎండలు మండిపోతున్నాయి, రాను రాను వర్షాలు తగ్గిపోతున్నాయి, భూగర్భ జలాలు పాతాళంలోకి వెళ్ళిపోతున్నాయి.
* మండుటెండలవల్ల వడగాల్పులు, కరువు కాటకాలు అధికమవుతున్నాయి. జలవనరులు క్షీణించిపోతున్నాయి.
* గత 5 దశాబ్దాలలో ఆర్కిటిక్ ధ్రువ ప్రాంతంలో ఒక హిమ ఖండం మందం 40 శాతం కరిగిపోయింది.
* సముద్రాలు పొంగి, వరదలొచ్చి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవిస్తున్నాయి. గత 3 వేల సంవత్సరాలతో పోలిస్తే గత 100 సంవత్సరాలలో సముద్ర మట్టాలు 3 రెట్లు వేగంగా పెరిగాయి.
* హిమఖండాలు అదృశ్యమైతే హిమ నదులు ఎండిపోయే ప్రమాదం ఉంది. గంగా, యమున వంటి నదులు కొన్ని సంవత్సరాలలో పిల్ల కాల్వలా మారిపోయే ప్రమాదం ఉంది.

## మరికొన్ని ప్రమాదాలు :

* గ్లోబల్ వార్మింగ్ వల్ల భూఅయస్కాంత శక్తి తగ్గిపోతోంది. ఇది మానవాళిపై ఒక పిడుగుపాటు. గత 300 సంవత్సరాలలో భూ అయస్కాంత శక్తి 30 శాతం క్షీణించింది.
* వాతావరణం వేడెక్కడం దోమలకు అయాచిత వరం. పొడి వాతావరణంలో అవి మరింత విజృంభించి మలేరియా, కలరా, డెంగ్యూ వంటి వ్యాధులు కల్గిస్తాయి.
* సముద్రమట్టాలు పెరిగి మాల్దీవులు వంటి దేశాలూ పూర్తి మటుమాయం కావచ్చు.
* గ్లోబల్ వార్మింగ్ ప్రపంచ సమస్య. అన్ని దేశాలూ కలిసికట్టుగా కదలి దీనికి పరిష్కార మార్గాలు అన్వేషించి వాటిని అచరణలో పెట్టాలి.
* ప్రస్తుతం వినియోగిస్తున్న ఇంధనం విధానంలో మార్పులు తీసుకురావాలి. జనాభా నియంత్రణను సమర్థవంతంగా చేపట్టాలి.

– శ్రీ సి.వి. సర్వేశ్వర శర్మ

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

*Bhimas Deluxe Hotel*

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

# జనకుడొసగిన యోగ్యతా పత్రం

డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

వేదవ్యాసుల పుత్రుడు శుకదేవుడు. వ్యాసులు స్వయంగా కుమారునికి ఆధ్యాత్మిక శిక్షణ ఇచ్చారు. విస్తృత జ్ఞానం కోసం మిథిలా నగర చక్రవర్తి జనక మహారాజు వద్దకు పంపారు. జనక మహారాజు మహాజ్ఞాని. రాజర్షి, బ్రహ్మ జ్ఞానాయత్తచిత్తుడైన అతనికి దేహభావన వుండేది కాదు. నిరంతరం ఆత్మభావంలోనే వుండేవాడు. అట్టి రాజర్షి వద్దకు శుకదేవుడు వచ్చాడు. శుకదేవుడు తనవద్దకు రానున్న విషయం, జనకమహారాజుకు ముందే తెలుసు. కాని ఆ ఋషి పుత్రుడు రాజద్వారం చేరినా ఎవరూ పలకరించలేదు. ఎవరూ స్వాగతించలేదు. ఎవరో వచ్చి ఆసనం వుంచారు. శుకదేవులు కూర్చున్నారు.

మూడు రాత్రులు అక్కడే వున్నా 'మీరు ఎవరు? ఎందుకు వచ్చారు' అని అడిగినవారే లేరు. ద్వారపాలకులు అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు కాని, ఆ వైపు చూడలేదు. శుకదేవులు వేదవ్యాసుల పుత్రులు. రాజాధిరాజుల మన్ననలందు కొన్నవారు. అయినా మూడు రోజులుగా, అతనిని ఉపేక్షిస్తూ వున్నారు.

ఒకరోజు, మహామంత్రి, ఉన్నతాధికారులు, శుకదేవుల వద్దకు వచ్చి ఉచిత మర్యాదలతో, జనక మహారాజు ఆస్థానానికి పిలుచుకొనిపోయారు. మహారాజు శుకదేవులకు సర్వాలంకృతమైన మందిరములో వసతి ఏర్పాటు చేశారు. సుగంధ ద్రవ్యాలతో స్నానం, విలువైన వస్త్రములు సమకూర్చారు. ఈ రాజవైభవాలు వారం రోజులు జరిగాయి. శుకదేవులు నిర్లిప్తులై వున్నారు. రాజద్వారం వద్ద నిరాదరణకు గురైనప్పుడు, ఏ రీతిగ ప్రసన్న గంభీర వదనులై వున్నారో, ఇప్పుడు కూడా వైభవోపేత సత్కారాల మధ్య అదే ప్రసన్న గంభీర వదనం!

మూడు రోజుల తర్వాత జనక మహారాజు స్వయంగా శుకదేవులను సభా మందిరమునకు ఆహ్వానించారు. జనక మహారాజు సింహాసనాసీనులై వున్నాడు. సంగీత నృత్యములు సాగుతున్నాయి. జనక మహారాజు ఒక రజిత పాత్ర నిండుగా పాలుపోయించాడు. ఆ పాత్రను, శుకదేవులకందజేసి "ఈ పాత్రలోని పాలు ఒక్క చుక్క కూడా కిందపడకుండా ఈ సభా భవనాన్ని ఏడు మార్లు చుట్టి రండి' అన్నాడు మహారాజు.

ఎంత కఠిన పరీక్ష! శుకదేవుడు నవయువకుడు. సభా భవనంలో సుందరాంగుల నృత్యం, శ్రవణపేయమైన సంగీతం. ఎంత విరాగులైనా, ఆ వైభవాలకు మైమరచిపోవాల్సిందే. అట్టి సమ్మోహ వాతావరణంలో నిండిన పాల పాత్రను చేతనుంచుకొని ఏడుమార్లు చుట్టి రావటం, ఒక చుక్క పాలు కూడా క్రిందపడకుండా, ఎవరికైనా సాధ్యమేనా! శుకదేవులు ఏకాగ్రచిత్తులై, ఏడుమార్లు సభా భవనమంతటా తిరిగి, పాల పాత్రతో, తమ ఆసనంపై కూర్చున్నారు. జనక మహారాజు సంతృప్తుడై, శుకదేవుల వద్దకు వచ్చాడు. "శుకదేవా, మీ తండ్రిగారి బోధనను మీరు పూర్తిగా జీర్ణించుకొన్నారు. నేను మీకు బోధించతగిన విషయమేదీ లేదు. మీరు ఆశ్రమానికి వెళ్ళవచ్చునంటూ, సాదరంగా వీడ్కోలు పలికాడు. ఈ సంఘటన మహత్తరమైన సందేశమిస్తుంది. శుకదేవులు మహాజ్ఞాని తండ్రి అయిన వేదవ్యాసుల అంతేవాసిగ జ్ఞానార్జన కావించాడు. అట్టి శుకదేవుని జనక మహారాజు వద్దకు పంపుటలోని ఆంతర్యమేమో! జ్ఞానం అనంతం. అంతులేనిదని సూచించటమే ఇందలి పరమార్థం. శ్రీరామకృష్ణ పరమహంస "నేను జీవించినంతవరకు నేర్చుకొంటూనే వుంటానన్నారు.

వేదవ్యాస మహర్షి పుత్రులకు, జనక మహారాజు మందిర ద్వారం వద్ద ఎదురైన అనాదరణ. అట్టి సమయంలో కూడా ప్రశాంత చిత్తులై వుండిన శుకదేవుల వ్యక్తిత్వం నిరుపమానం! మూడురోజుల నిరాదరణ తర్వాత దివ్యమైన రాజోపచారాలు. అయినా శుకదేవులలో ఎటువంటి మార్పూ కానరాలేదు.

జనకమహారాజు శుకదేవులకు జ్ఞానబోధ చేసిన తీరు. అటువంటి పరిస్థితిలో శుకదేవులు చిత్త స్థైర్యం కించిత్తైనా సడలలేదు. రాజర్షి నుంచి మహర్షికి యోగ్యతా పత్రం లభించింది. జ్ఞానార్జనకు ప్రధానం ఏకాగ్రత. మహాజ్ఞానియైన వేదవ్యాసులు. తమ పుత్రుని మరొక దివ్య జ్ఞాని వద్దకు పంపటం జనకమహారాజు వద్ద తత్వార్థమును తెలుసుకొనుటకు వెళ్ళటం అతని వినయశీలమునకు నిదర్శనం. అందుకే విద్యాదదాతి వినయం – వినయేన శోభతే విద్య అన్న సూక్తికి సాకారంగా వెలిగారు శుక మహర్షి. ●

# దైవాన్ని కోరిక ఎలా కోరాలి?

1. నువ్వు బతికి ఉన్నంత కాలం ధార్మిక కార్యాలు నీ సంపదతో చేయాలి అని కోరుకోవాలి, అంటే ఎప్పుడూ నువ్వు ఇచ్చే స్థితిలో ఉండాలి అని అర్థం అంటే ఎప్పటికీ నీకు సంపాదన ఉంటుంది.
2. నా ఇంట్లో దైవానికి నిత్య నైవేద్యం ఉండాలి అని కోరుకోవాలి అంటే నీ ఇంట్లో ధాన్యం ఎప్పుడూ నిలువ ఉంటుంది.
3. నా ఇంట్లో నేను నిత్య పూజ రోజు చేయాలి అని కోరుకోవాలి అంటే నీ ఆరోగ్యం బాగుంటే నువ్వు ఎప్పుడూ ఆనందంగా ఉంటే నీ ఇంట్లో నిత్య పూజ చేస్తావు.
4. నా ఇంటికి ఎవ్వరు వచ్చినా కడుపునిండా భోజనం చేసి వెళ్ళాలి అని కోరుకోవాలి అంటే నీకు అనుకూల వతి అయిన ధర్మపత్నీ (పతి) భాగస్వామి అవుతుంది.
5. నేను నా చివరి దశ వరకు నీ క్షేత్రానికి దర్శనానికి రావాలి అంటే నీకు సంపూర్ణ మైన ఆరోగ్యాన్ని ఇవ్వమని అడగటం..
6. భాగవతులతో నీ గడప నిండుగా ఉండాలి అని కోరుకోవాలి అంటే నీకు సమాజంలో తగిన గౌరవం మంచి పేరు రావాలి అని కోరుకోవ డం...
7. కుటుంబం అంతా సంతోషం గా క్షేత్ర దర్శనంకి రావాలి అని కోరాలి అంటే నువ్వు ఆరోగ్యంగా, ఆర్థికంగా, కుటుంబంలో అన్యోన్యంగా ఉంటేనే జరుగు తుంది ఇంక ఏమీ కావాలి జీవితానికి..
8. చివరిగా నేను పండు ముత్తైదువుగా సంతోషంగా కాలం చేయాలి అని కోరుకోవాలి అంటే భర్తకు సంపూర్ణ ఆయువు ఆరోగ్యం కోరుకోవడం..

మనకు తల్లిదండ్రులు ఆ దైవమే వారిని కాకా ఎవరిని అడుగుతాము కానీ ఆ అడిగే కోరిక ఇలా ఉంటే ఆ దైవం కూడా అనుగ్రహిస్తుంది.



## పరమార్థ కథలు

## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

# భక్తితోగూడిన దానికే విలువ



పూర్వకాలమున ఒకానొక గ్రామమున ఒక భక్తుడు నివసించుచుండెను. అతడు "ఓమ్ నమో నారాయణాయ" అను అష్టాక్షరీ మహా మంత్రమును నిరంతరము జపించుచుండెడివాడు. తన పూజా మందిరములో శ్రీమన్నారాయణుని విగ్రహము నెదుట గూర్చొని భక్తిపూర్వకముగ ప్రతిదినముపై మంత్రమును పునశ్చరణ చేయు చుండెను. ప్రాపంచిక పదార్థములపై అతనికి ఏమాత్రము ఆసక్తి లేకుండెను. వైరాగ్యసంపన్నుడై భోగవస్తుజాలమును లెస్సగా పరిత్యజించి, దృష్టిని బహిర్ముఖముగ ప్రసరింపజేయక, నారాయణుడే తనకు దిక్కని నమ్మినవాడై మనోవాక్కాయములచే ఆయననే హృదయమున సంస్మరించుచు నుండెను.

ఇట్లుండ, ఒకనాడతడు ప్రతిదిన పద్ధతి ప్రకారము ఉదయముననే స్నానాదులను నిర్వర్తించుకొని శుచిర్భూతుడై తన పూజా మందిరమున శ్రీమన్నారాయణుని దివ్యమంగళ విగ్రహము నెదుట గూర్చుండి దృష్టిని భ్రూమధ్యమున నిలిపి తదేక దృష్టితో నారాయణుని భావించుచు అష్టాక్షరీ మంత్రమును జపించుచుండ, అతని భక్తికి, అపరిమిత శ్రద్ధకు మెచ్చి వైకుంఠనాథుడు శంఖ చక్ర గదాధారియై ఆకస్మికముగ ఆ పూజా మందిరమున ప్రత్యక్షమయ్యెను. భగవానుని ప్రత్యక్షముగ దర్శింపగల్గు మహద్భాగ్యము ఉదయించుటచే ఇక ఆ భక్తుని ఆనందమునకు మేరయే లేకుండెను. తదేక దృష్టితో ఆనంద పరవశత్వములో, ఉత్కంఠితహృదయముతో అతడు భగవానుని ప్రత్యక్ష రూపము వీక్షించుచుండెను. ఏమిచేయుటకును తోచకుండెను. అది భగవానుని ఆకస్మిక గమనము (Surprise visit) అగుటవలనను, దేవుని సత్కరించుటకు ముందుగా ఏవిధమైన ఏర్పాట్లు చేసియుంచు కొనకపోవుటవలనను, కడుబీదవాడగుటచేతను భగవంతునికి నివేదించుటకు తగిన వస్తుసంభారములు లేక యుండుటవలనను, ఇంటికి వచ్చిన ఆ లోకోత్తర అతిథిని ఎట్లు సత్కరించవలెనో తోచక తికమక పడుచు తొట్రుపాటు పడుచునుండెను.

భగవద్దివ్య స్వస్వరూపసందర్శన జనిత మహదానంద పరిపూరిత హృదయ సహితుడగు ఆ భక్తుడు తత్సమయమున తన పూజా మందిర మంతయు తేరిపారచూడ ఒకమూల ఒక అరటిపండు అతనికి దృగ్గోచరమయ్యెను. తోడనే పరుగెత్తికొని వెళ్ళి దానిని పట్టుకొనివచ్చి, ఆ స్వల్పప్రసాదము నైనను భగవంతునకు నివేదింపదలంచి, ఆనంద పారవశ్యముచే ఒడలు గగుర్పాటు నొందుచుండ మనస్సు నారాయణుని దివ్యపాద పద్మములపై సంలగ్న మొందియుండ, తొందరలో ఆ అరటి పండును ఒలిచి లోని గుజ్జును పారవైచి తొక్కును దేవునకు పెట్టెను. భక్తిరసముచే పరిప్లావితమైన ఆ తొక్కును భగవానుడపుడు ఆనందముతో స్వీకరించి, భుజించి అంతర్ధాన మొందెను.

తదుపరి కొద్దిసేపటికి ఆ భక్తుడు తన పొరపాటును గుర్తెరిగి పశ్చాత్తాపతప్తుడై, భగవానునకు గొప్ప అపచారము చేసితినని తలంచి అత్యంతఖిన్నుడై, ఏమి చేయుటకును తోచక హృదయము వేదనలో గ్రుంకుచుండ గొప్ప పరితాపమును బొందుచుండెను. "అయ్యో ! నేనేల ఇట్లు చేసితిని? సామాన్యమానవుని కైనను అరటితొక్కును ఎవ్వరును ఇవ్వరే? ఇక చతుర్దశ భువనాధిపతి యగు శ్రీమన్నారాయణునికి నేనేల ఇట్టి తుచ్ఛవస్తువు నొసంగితి?" అని పలువిధముల తలపోయుచు తుదకు గుండె నిబ్బరము కలుగజేసికొని ఈ క్రింది దృఢనిశ్చయమునకు వచ్చెను. ఇక విచారించిన ప్రయోజనము లేదు. మరల భగవానుని త్వరలోనే నేను ప్రత్యక్షమొనర్చుకొనెదను. అతడు భక్తవత్సలుడు కావున పరిపూర్ణభక్తితో, అకుంఠిత దీక్షతో అష్టాక్షరీ మహామంత్రమును జపించుచు, అతనిని ధ్యానించినచో తిరిగి యతడు ప్రత్యక్షము కాగలడు.

అయితే ఈసారి పూర్వము చేసిన పొరపాటు మరల జరుగకుండు నిమిత్తము ముందుగనే యతడు చాల జాగ్రత్తపడెను. ఒకగెల అరటిపండ్లు తెప్పించి దేవుని విగ్రహము ముందు పెట్టి "ఒక వేళ భగవంతుడు అకస్మాత్తుగ ఇచటికి వచ్చినప్పటికిని ఈసారి పండు ఒలిచి గుజ్జుమాత్రమే దేవునకు పెట్టి తొక్కు పారవేసెదను" అని కృతనిశ్చయుడై ఆ గెలలోని ఒక్కొక్కపండు త్రుంచి, తొక్కుతీసి గుజ్జును గట్టిగా చేతితో పట్టుకొని దేవున కిచ్చునట్లుగా అభ్యాసము (Reharsal) చేయదొడగెను. ఈ ప్రకారము గెలలోని అన్ని పండ్లను ఒక్కొక్కటిగ త్రుంచి గుజ్జును గట్టిగా పట్టుకొను అభ్యాసము చేసి ఆ పనియందు చక్కని ప్రావీణ్యమును బడసెను. "ఇక దేవుడు ఎపుడువచ్చినను పరవాలేదు. ఈసారి గుజ్జుమాత్రమే నివేదింపబడ గలదు గాని తొక్కుకాదు" అని బాగుగ నిశ్చయించుకొని మరల తన పూజాగృహమున ప్రతిదినము పూజచేయదొడంగెను.

ఇట్లుండ ఒకనాడు అతని భక్తికి మెచ్చి శ్రీమన్నారాయణుడు, మరల ప్రత్యక్షమయ్యెను. పూర్వపు అభ్యాసము దృఢపడి యుండుటచే వెంటనే అతడు ప్రక్కనున్న అరటిపండును పట్టుకొని జాగ్రత్తగ ఒలిచి గుజ్జును గట్టిగ పట్టుకొని తొక్కును పారవైచి, అగుజ్జును భగవానుని నోటిలో పెట్టెను" కాని భగవానుడు దానిని భుజింపక ఊసివేసెను. అపుడాభక్తుడు దుఃఖాక్రాంతుడై విలపించుచు, భగవానుని పాదపద్మములపైపడి, ఏల తాము భుజింపలేదని ప్రార్థింప అతడిట్లు నుడివెను; ఓయీ! పూర్వము నీవు నాకు తొక్కను నివేదించినపుడు నీ మనస్సు నా పాదపద్మములపై సంలగ్నమై యుండుటవలన అపారమైన ఆ వస్తువు భక్తిరసముచే తడుపబడి అమృతతుల్యమై యుండుటచే నేను దానిని భుజించితిని, ఈసారి వచ్చినపుడు నీవు గుజ్జును ఇచ్చినప్పటికిని నీ మనస్సంతయు అరటి పండు పైననే లగ్నమై యుండుట వలన, వస్తువు మంచిదైనను భక్తిరసహీనమై యుండుటవలన అది విషతుల్యముగ మారినది. అందుచే నే నద్దానిని భుజింపక పారవేసితిని." అని చెప్పి యంతర్థానమొందెను.

అప్పటినుండియు ఆ భక్తుడు తెలివితెచ్చుకొని భగవన్ని వేదనాది కార్యములందు వస్తువుకంటె భక్తికే ప్రాధాన్యత నొసంగుచు వచ్చి క్రమముగ భగవదనుగ్రహమునకు పాత్రుడు కాగల్గెను. దేవుడు తనకు "ఏది ఒసంగిరి" అని చూడదు "ఎట్లు ఒసంగిరి" అని చూచును. కాబట్టి జనులు పూజా ప్రార్థనాదులందు భక్తికి ప్రాధ్యానత నిచ్చి దానిని బాగుగ అభివృద్ధి నొందించుకొనుచుండవలెను.

**అణ్వప్యుపాహృతం భక్త్యా ప్రేమ్ణాభూర్యేన మే భవేత్ ।**
**భూర్యప్యభక్తోపహృతం న మే తోషాయ కల్పతే ॥**

కొంచెమైనను భక్తితో, ప్రేమతో ఒసంగబడినది కొందం కాదు. కొండంత ఇచ్చినను భక్తితో కూడియుండనిచో అది నా సంతుష్టిని కలుగజేయజాలదు.– అను ఈభగవద్వాక్యమును సర్వులు స్మృతిపథమున నుంచుకొని సర్వేశ్వరునియెడల అనన్య భక్తిభావమును పెంపొందించు కొనుదురుగాక!

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

# తమిళ భాషలో కవిరాజుగా ప్రసిద్ధి చెందిన కన్నదాసన్ గారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు

# "అర్థవంతమైన హిందూ మతము"

1. భగవంతుడు లేడని చెప్పినా, మత ద్రోహిగా పరిగణించని ధర్మం, హిందూధర్మం.
2. రోజుకు ఇన్ని సార్లు, వారానికి ఇన్ని సార్లు, నెలకు ఇన్ని సార్లు తప్పనిసరిగా గుడికి వెళ్ళే తీరాలనే నిబంధనలు పెట్టని ధర్మం, హిందూధర్మం.
3. జీవిత కాలంలో కాశికో లేక రామేశ్వరానికో తప్పనిసరిగా ఒక్క సారి వెళ్ళే తీరాలనే నిబంధనలు పెట్టని ధర్మం, హిందూధర్మం.
4. హిందూ మత గ్రంథాల ప్రకారమే జీవనాన్ని కొనసాగించాలనే నిబంధనలు పెట్టని ధర్మం, హిందూధర్మం.
5. హిందూ మతానికి ప్రత్యేకమైన మతపెద్ద అంటూ ఎవరూ ఉండరు.
6. సన్యాసులు, స్వామీజీలు, మఠాధిపతులు తప్పులు చేసినా, నిలదీసి, ప్రశ్నించే ధర్మం, హిందూధర్మం.
7. హిందువులు ఈ క్రింది వాటిని కూడా భగవత్సరూపాలుగానే ఆరాధిస్తారు.

వృక్షాలు దైవ స్వరూపాలే.
రాళ్ళూ - రప్పలూ కూడా దైవస్వరూపాలే.
నీరు (గంగ) కూడా దైవ సవరూపమే.
గాలి కూడా దైవ స్వరూపమే.
వానరాలు (కోతులు) కూడా దైవ స్వరూపాలే.
కుక్కలు (భైరవుడు) కూడా దైవ స్వరూపాలే.
పందులు (వరాహం) కూడా దైవ స్వరూపాలే.

8. నువ్వూ దైవ స్వరూపమే.
   నేనూ దైవ స్వరూపమే.
   చక్షు గోచరమైనవన్నీ (కంటికి కనిపించేవన్నీ) దైవ స్వరూపాలే.
9. చతుర్వేదాలు, నాలుగు ఉప వేదాలు, రెండు ఇతిహాసాలు, పద్దెనిమిది పురాణాలు, పద్దెనిమిది ఉప పురాణాలు, ఆరు శాస్త్రాలు, పద్దెనిమిది స్మృతులతో పాటు 1200 వందలకు పైగా ధార్మిక గ్రంథాలు గల సువిశాల ధర్మం, హిందూధర్మం.

మన ధార్మిక గ్రంథాలు మనకు బోధించే విశిష్ట ధర్మాలు.
కర్మల గురించి తెలియాలంటే...
- వేదాలు చదవాలి.
సమస్త జ్ఞానం పొందాలంటే ......
- ఉపనిషత్తులు చదవాలి.
పర స్త్రీ వ్యామోహం పోవాలంటే ......
- రామాయణం చదవాలి.
రాజ్యకాంక్ష, పదవీ వ్యామోహం పోవాలంటే...
- మహాభారతం చదవాలి.
భగవంతుని తత్త్వం తెలియాలంటే...
- భాగవతం చదవాలి.
చక్కటి పరిపాలన అందించాలంటే...
- కౌటిల్యుని "అర్థశాస్త్రం" చదవాలి.
అన్యోన్య దాంపత్యానికి...
- వాత్స్యాయన కామశాస్త్రం చదవాలి.
చక్కటి ఆరోగ్యానికి...
- ఆయుర్వేదం చదవాలి.
మేథస్సుకు...
- వేద గణితం చదవాలి.
శారీరక ఆరోగ్యానికి మరియు శారీరక సౌష్ఠవానికి...
- పతంజలి యోగశాస్త్రం చదవాలి.
భవన నిర్మాణాలకు...
- వాస్తుశాస్త్రం చదవాలి.
గ్రహ, నక్షత్రాలను గురించి తెలుసుకోవడానికి...
- ఖగోళ శాస్త్రాన్ని చదవాలి.

11. ఎవ్వరినీ బలవంతంగా మతం మార్పించే ప్రయత్నం చేయని ధర్మం, హిందూధర్మం.
12. ఆహార అలవాట్లలో కూడా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఉండవచ్చు. (ప్రపంచంలో శాకాహారం, మాంసాహారం ఈ రెంటిలో ఎవరికి నచ్చిన ఆహార పద్ధతులను వారు పాటించవచ్చు.)
13. హిందూధర్మం, అన్ని మతాలను, అన్ని ధర్మాలను సమానంగానే పరిగణిస్తుంది.
14. మోక్షానికి దారి చూపించే ధర్మమే, హిందూధర్మం.
15. అన్ని మతాలను గౌరవించే ధర్మం, హిందూధర్మం. 16. పరమత దూషణ చెయ్యని ధర్మం, హిందూధర్మం.


## ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత **26** సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :

| | | |
|---|---|---|
| Account Name | : | PRAMUKHANDHRA |
| Account No | : | 20011102592 |
| Bank | : | BANK OF MAHARASTRA, T.NAGAR |
| IFSC Code | : | MAHB 0000450 |

**ప్రముఖాంధ్ర**
64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై - 33.
మొబైల్ : 98400 48941

# మానవ జన్మ

భగవంతుడు ప్రసాదించిన – మానవ జన్మ ఎలా తరింప చేసుకోవాలో – నిర్ణయం మనదే!

సృష్టిలో మానవజన్మ ఎంతో క్లిష్టమైనది. అతడు పుట్టడంతోనే అతనిలో మమేకమై ఉన్నవి పదకొండు ఇంద్రియాలు. అవి లేకుంటే అతడు మనుగడ సాగించలేడు.

ఆ పదకొండులో....

1. అయిదు జ్ఞానేంద్రియాలు,

2. అయిదు కర్మేంద్రియాలు, మనసు ఉన్నాయి.

1. శ్రోత్రం (చెవి), 2. త్వక్ (చర్మం), 3. చక్షుషీ (కన్నులు), 4. జిహ్వా (నాలుక), 5. నాసికా (ముక్కు) అనేవి జ్ఞానేంద్రియాలైతే,

1. పాయు (మలద్వారం), 2. ఉపస్థ (మూత్రద్వారం), 3. హస్త (చేతులు), 4. పాద (కాళ్లు), 5. వాక్ (మాట) అనేవి కర్మేంద్రియాలు.

ఈ పదింటికి చివర మనసు.

ఇదీ ఇంద్రియ సమూహం.

ఈ పదకొండు ఇంద్రియాలు పదకొండు విధాలుగా మనిషిని కష్టపెడతాయి. ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తాయి.

ఇంద్రియనిగ్రహం అనేది మనిషికి బతుకు సమస్య.

ఇంద్రియాలు గుర్రాల వంటివని, రథాన్ని నడిపే సారథి పగ్గాలను సమర్థంగా పట్టుకొని అదుపు చేయకపోతే గుర్రాలు ఇష్టం వచ్చిన దిక్కుకు ప్రయాణిస్తాయని, అప్పుడు ప్రమాదాలు సంభవిస్తాయని, కనుక సారథి వంటి మనిషి ఇంద్రియాలు అనే గుర్రాల పగ్గాలు లాగి అదుపులో పెట్టుకోవాలని అంటాడు మనువు.

1. మనిషి సంయమనాన్ని కోల్పోతే చెవులు చెడు మాటలనే వింటాయి.

2. చర్మం పనికిరాని స్పర్శను కోరుతుంది.

3. కళ్లు అశ్లీలాన్ని చూస్తాయి.

4. నాలుక అనారోగ్యకరమైన రుచులను కోరుతుంది.

5. ముక్కు దుర్గంధాలనే స్వీకరిస్తుంది.

6. మల, మూత్రద్వారాలు పనిచేయకుండా పోతాయి.

7. కాళ్లూ చేతులూ హింసను ఆచరిస్తాయి.

8. మాట అదుపు తప్పుతుంది.

ఇలా పది ఇంద్రియాలు చేసే నష్టం ఒక ఎత్తయితే,

9. మనసు అనే పదకొండో ఇంద్రియం చేసే నష్టం ఒక ఎత్తు.

అసలు పది ఇంద్రియాలను మంచిగాను, చెడుగాను మార్చేది మనసే. మనసు చెప్పినట్లే ఇంద్రియాలు వింటాయి.

అందుకే వాల్మీకి– 'ఇంద్రియాల సత్‌ప్రవర్తనకు, అసత్‌ప్రవర్తనకు మనసే మూలకారణం' అని రామాయణ మహాకావ్యంలో అంటాడు.

చెడు వినకుండా, చెడు కనకుండా, చెడు అనకుండా, చెడు తినకుండా, చెడు ఆఘ్రాణించకుండా ఉండగలిగేవాడే జితేంద్రియుడని శాస్త్రాల ప్రబోధం.

ఇలా ఉండాలంటే మనిషి మొదట జ్ఞానవంతుడు కావాలి. జ్ఞానం లేని కర్మాచరణ పిచ్చివాడి చేతిలో రాయి వంటిదే. అది ఎవరిమీదనైనా పడవచ్చు. నిప్పును తాకితే కాలుతుందని తెలిసిన జ్ఞాని, నిప్పును తాకడానికి సాహసించడు.

ఆ విషయం తెలియని బాలుడు నిప్పును తాకి చేతులు కాల్చుకుంటాడు. కనుక ఏ పనిచేసే సమయంలో అయినా ఆ పనికి సంబంధించిన జ్ఞానం అవసరం. లేకుంటే ఇంద్రియాలు మనిషిని పక్కదారి పట్టిస్తాయి. ఇంద్రియాలు అదుపులో ఉన్నంతవరకు మనిషి ఉజ్జ్వలంగా వెలిగిపోతాడు.

ఇంద్రియాల్లో ఏ ఒక్కటి అదుపుతప్పినా, అన్ని ఇంద్రియాలూ క్రమంగా పట్టుతప్పిపోతాయి.

పర్యవసానంగా మనిషిలోని ప్రజ్ఞ నశించిపోతుంది.

ప్రకృష్టమైన (విశిష్టమైన) జ్ఞానమే ప్రజ్ఞ. అంటే అన్నింటినీ చక్కగా గుర్తించే గుణం. అది ఉన్నంతకాలం మనిషి మెదడు అనే యంత్రం పనిచేస్తుంది.

మెదడును చక్కగా ఉంచుకోవడానికి 'ఆయుర్వేదం' ఇలా మార్గోపదేశం చేస్తోంది.

పరిశుద్ధమైన ఆహారాన్ని మాత్రమే ప్రతినిత్యం స్వీకరించాలి. అలా స్వచ్ఛమైన ఆహారాన్ని తినడంవల్ల ఇంద్రియాలన్నీ పటిష్ఠంగా ఉంటాయి.

అవి దృఢంగా ఉన్నప్పుడే మెదడు బాగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి వర్ధిల్లుతుంది'.

ఇంద్రియాల వెనక ఉన్న ఇంతటి సాంద్రమైన విషయాన్ని మనిషి ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

అందువల్ల జితేంద్రియుడు (ఇంద్రియాలను జయించినవాడు) కావాలో, ఇంద్రియజితుడు (ఇంద్రియాలతో ఓడిపోయినవాడు) కావాలో తేల్చుకోవలసింది మనిషే!

# పంచ గయలు

**మన భారతదేశంలో మొత్తం 5 గయలు ఉన్నాయని చెబుతారు.**

**1. శిరోగయ, 2. నాభిగయ, 3. పాదగయ, 4. మాతృగయ, 5. పితృగయ.**

**1. శిరోగయ :** బీహార్ రాష్ట్రంలో ఫల్గుణీ నదీ తీరంలో "శిరోగయ" గా వెలసింది. దీనినే బుద్ధగయ అని కూడా అంటారు.

**2. నాభిగయ :** జాజాపూర్, ఒరిస్సా రాష్ట్రంలో వైతరణి నదీ తీరంలో వున్న ప్రదేశంను "నాభిగయ" అని అంటారు.

**3. పాదగయ :** పిఠాపురం, ఆంధ్ర ప్రదేశ్‌లో గయని పాదాలుండటం వలన అవి వున్న ప్రదేశం పిఠాపురాన్ని "పాదగయ" అంటారు.

**4. మాతృగయ :** గుజరాత్ రాష్ట్రంలో మహేషన జిల్లాలో సరస్వతీ నదీ తీరంలో గల ప్రాంతాన్ని "మాతృగయ" అని అంటారు. బిందు సరోవరమనే మరో పేరు కూడా కలదు. అహ్మదాబాదుకు 32 కిలోమీటర్ల దూరంలో గల మాతృగయలో మాతృవంశం వారికి పిండప్రదానం మరింత ముఖ్యం. ఒరిస్సాలోని భువనేశ్వర్‌కి 33 కి॥మీ॥ దూరంలో వున్న బిందు సరోవరం వద్ద కూడా పిండ ప్రదానాలు చేస్తారు.

**5. పితృగయ :** బదరీనాథ్, ఉత్తర ప్రదేశ్‌లోని అలకనందా నదీ తీరంలో గల "బ్రహ్మకపాలం" అనే ప్రదేశాన్ని "పితృగయ" అంటారు.

Beautiful City - Beautiful Hotel


DO NOT MISS



Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225



(గోటేటి వేంకటేశ్వరరావు)

# బుద్ధిని ఉన్నత విషయాలతో, అద్వితీయమైన ఆదర్శాలతో నింపుకోండి.

- స్వామి వివేకానంద



# జీ.వి. రావ్ పేజీ

## జనన మరణాలు - సర్వసహజములు

*జనన మరణాలనేవి సర్వులకు సహజమే. పుట్టిన ప్రతివాడు గిట్టకమానడు.*

జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ
తస్మాఽ పరిహార్యేఽ ర్థే నత్వం శోబితుమర్హసి

*– గీతలో భగవానుడు చేసిన ఈ ఉపదేశము అన్నీ కాలాలకు అన్ని ప్రాంతాలకు చెందిన వ్యక్తులందరికి వర్తించిందే. ఈ దేహాలన్నీ నశించేవే – అయినా మనం సాధారణ మానవులము ఈ లౌకిక ప్రపంచంలో వున్నందువల్ల మనం ప్రేమాభి మానాలు పెనవేసుకుని పెంపొందించుకున్నందువల్ల కొన్ని మరణాలు మనకి బాధ కలిగిస్తాయి. వాటినుండి మనం బయటపడదానికి కొంత సమయం కూడా పడుతుంది. అలాంటి కొందమంది ఈ మధ్యకాలంలో నన్ను బాగా బాధపెట్టినవి మీకు పంచుకుంటున్నాను. వీరందరూ గోటేటి కుటుంబానికి, ప్రముఖాంధ్ర పత్రికకు బాగా కావలసినవారు. వీరందరు మా క్షేమాన్ని ఎప్పుడు కోరుకునే పవిత్రాత్ములు. మా శ్రేయోభిలాషులు. ఎక్కడ కనపడిన పలకరించేవారు. నాన్నగారినే కాదు నాకు బాగా కావలసివారు. నాతోనూ ఆత్మీయంగా పలకరిస్తూ నా యోగక్షేమాలు కూడా తెలుసుకుంటూ వుండేవారు.*

*నాకు ఇలా మృతులైనవారిని గురించి రాయాలన్న, పరామర్శకు వెళ్ళాలన్నా నాకు అదోలా వుంటుంది. అంటే బాగా మనతో చనువున్నవారు, మనమంటే గౌరవం అభిమానం చూపేవారు అయితే కాస్త ఇబ్బంది పడతాను. అలా వీరందరి మరణం నన్ను కొంత బాధపెట్టినది.*

### యు.విశ్వేశ్వరరావుగారు



విశ్వశాంతి విశ్వేశ్వరరావుగారిగా ఎన్.టి. రామారావు గారికి ప్రతిష్టాత్మకమైన చిత్రాలు నిర్మించినవారిగా సుప్రసిద్ధులు. పెద్ద పెద్ద సినిమాలు చేసి కాస్త పేరు డబ్బు గడించాక తన దృష్టిని ప్రయోగాత్మక చిత్రాలవైపు మరల్చి తీర్పు, మార్పు వంటి సినిమాలను నిర్మించి తానే దర్శకత్వము వహించి తన పేరును, తెలుగు చలన చిత్రసీమను గౌరవ పరచిన వ్యక్తి. ఇక మాకు ఆప్తులు. నాన్న గారితో ఎంతో చనువుగా మాట్లాడుతారో నాతోను అంతే చనువుగా వుంటారు. ఆయన తీర్పు, మార్పు సినిమాలకు చిన్న చిన్న పబ్లిసిటి బుక్‌లెట్‌లు వెయ్యవలసివచ్చినపుడు నన్ను పిలిపించి వాటిని మా ప్రెస్‌లోనే ప్రింట్ చేయించారు. అంతేకాదు ఆయన సౌత్ ఇండియన్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరిగా నున్నప్పుడు ఫిలిమ్ మార్కెట్ అంటూ ఏర్పరిచి, అందలో వారు చలన చిత్రోత్సవాలలో తాను నిర్మించిన అన్ని చిత్రాల ఫోటోలు, సినాప్సిస్ రంగులో ప్రింట్ చేయించి ఎంతో చక్కగా వచ్చిందని పదిమందికి చెప్పి మెచ్చుకున్నారు. అలాగే ప్రపంచ తెలుగు సమాఖ్యకు ప్రారంభం నుండి ప్రతి పనిని మా గోటేటి గ్రాఫిక్స్ లోనే చేయించేవారు. ఒక మూడు నెలలు వారానికి రెండుసార్లు ఆయన, బి.యస్.ఆర్ కృష్ణగారు మా ప్రెస్‌లోనే కూర్చుని వారు అనుకున్న రీతిగా వచ్చే దాకా ఆ పనిని చేయించేవారు. అలా వారితో సమానంగా నన్ను కూర్చోపెట్టుకుని సినిమా విషయాలే కాకుండా రాజకీయాలు ఇలా ఎన్నో విషయాలు మాట్లాడుకునేవారం. కొన్ని విషయాలు ఆయనతో నేను ఏకీభవించకపోయినా ఎవరి అభిప్రాయం వారిది అంటూ హుందాగా వుండేవారు. తన అభిప్రాయాన్ని మనపై రుద్దరు. అదే కరక్టని వాదించరు. నాన్నగారు మరణానంతరం నాకు ఫోన్ చేసి చాలా బాధపడ్డారు. ప్రతి నెల ప్రముఖాంధ్ర అందుకున్నానంటూ ఫోన్ చేసి కాసేపు మాట్లాడేవారు. అలాంటి మనుషులు మనకు దొరకడం అదృష్టం, వారి మరణం దురదృష్టం.

### శ్రీ జి.ఆనంద్



చాలా మంచివారు, మృదుస్వభావులు, కించిత్ గర్వములేనివారు. తానను కున్నట్టుగా కాకుండా వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా, గౌరవాన్ని తగ్గించుకోకుండా ముందుకు దూసుకుపోయిన వ్యక్తి. ఆయన ప్రతిభకు తగ్గ అవకాశాలు రాలేదనీ నా అభిప్రాయం. స్వరమాధురి అనే స్వంత ట్రూప్‌ను ఏర్పరచుకొని దేశవిదేశాలలో ఎన్నో ప్రోగ్రాములు ఇచ్చి విశేష పేరు ప్రఖ్యాతులందు కున్నారు. ఆయన నా పెళ్ళి రిసెప్షన్‌కు వారి స్వరమాధురి బృందం చేసిన కచేరి నాకు ఇంకా మనసులో గుర్తుంది. స్వరమాధురి 25 సంవత్సరాలకు ఒక సావనీర్‌ను వేస్తూ అది మీ ప్రెస్‌లోనే ప్రింట్ అవ్వాలని మరీ పట్టుబట్టి పని చేయించుకున్నారు. అంతేకాదు ఎక్కడ కనిపించినా ఆత్మీయతతో పలకరించే వ్యక్తిత్వం. ఆయన లేరనుకోవడం కాస్త బాధగా వుంది.

### శ్రీమంగపతి



నాకు ఆయన నాస్కూల్ రోజులనుంచి తెలుసు. వారి అమ్మాయి శారదను స్టాండర్డ్ 10 కారులో దింపి వెడుతూ వుండేవారు. హెచ్ఎమ్‌విలో వున్నత ఉద్యోగం. మనందరం ఇప్పుడు వింటున్న ఘంటసాల గారి భగవద్గీత ఆయన ఆధ్వర్యంలో, రికార్డ్ చెయ్యబడిందని ఎంతమందికి తెలుసు. మా పత్రికలో ఈ విషయాన్ని నాలుగైదుసార్లు ప్రస్తావించాము కూడా. దానికొరకు ప్రత్యేకంగా ఆయన మా ప్రెస్‌కు వచ్చి తన కృతజ్ఞతలు తెలియపరచారు. అలా కాసేపు ఆ కాలం ముచ్చట్లు ఆయనతో కాలక్షేపంగా మాట్లాడేవాడిని. నాన్నగారి స్నేహితులే అయినా నన్ను గౌరవించి నాతో సంభాషించేవారు. అడపదడపా ప్రెస్ కొస్తూ


వుండేవారు. ఆయన లేరన్న విషయాన్ని ఎవరో మిత్రుల ద్వారా తెలుసుకో వలసివచ్చింది. నిగర్వి, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం.

### శ్రీఘంటసాల రత్నకుమార్



ఈ రోజుకి ఆయన లేరంటే ఒప్పుకోలేకపోతున్న. వారి కుటుంబం వారి నాన్నగారి కాలం నుంచి మా కుటుంబం బాగా ఆత్మీయంగా ఎరిగివున్న వారం. రత్నకుమార్ కాలేజి రోజుల నుంచి నాకు పరిచయం. మేము తీసిన నాలుగైదు డబ్బింగు సినిమాలకు రత్నకుమార్ గాత్రనందించారు. కలుపుగోలు మనిషి. ఎక్కడ ఎంత మందిలో వున్న దగ్గిరకొచ్చి కాసేపు కూర్చుని పలకరించి వెళ్ళేవాడు. నాన్నగారిని ఆయన ఆరోగ్యం బాగలేనప్పుడు ఇంటికొచ్చి కాసేపు కూర్చుని పలకరించివెళ్ళేవారు. ఇక మా ఇద్దరికి ఒరేయ్ అంటే ఒరేయ్ అనుకునేంత స్నేహం కాకపోయిన ఒకరంటే ఒకరికి మంచి గౌరవాభిమానాలున్నాయి. వారి నాన్నగారి పేరు నా పేరు ఒకటైనందువల్ల అభిమానం ఎక్కువ. బాగా చనువుగా భుజంమీద చెయ్యివేసి మాట్లాడేవారు. చాలా విషయాలు చర్చించేకునేవారం. ఆస్కాలో ఏ సభ జరిగిన అందు ఆయన వుంటారు. అంతేకాదు నన్ను చూడగానే ప్రక్కన కూర్చుని కాసేపు కబుర్లాడి వెళ్ళేవాడు. రత్నకుమార్ మరణం ఊహించది. అనుకోనిది. అంతేకాదు మా చిన్ననాటి స్నేహితు లందరు రత్నకుమార్ స్నేహితులే. అందరూ అప్పుడేనా అంటూ వాపోయినవారే.

### ఆచార్య జి.వి.యస్.ఆర్.కృష్ణమూర్తిగారు



ఆయన్ను మొదటిసారి నేను చూసింది మద్రాసు యూనివర్శిటిలో సంపత్‌కుమార్‌గారితో. నేను పలానా అని పరిచయం చేసుకున్నాను. ఆయన ఇంటి పేరు గోపాలునివారు మా అత్త గారి ఇంటిపేరు గోపాలునివారు నవ్వుతూ ఆ విషయం చెప్పి నపుడు ఏదో చుట్టరికం వుండుం టుందిలే అన్నారు నవ్వుతూ. చాలా సభలలో కలిసారు. తరువాత తెలుగు చరిత పత్రికకు కొన్నాళ్ళు ఆయన దగ్గర నుండి వ్యాసాలు తీసుకుని ప్రూఫులు ఇవ్వడానికి వెళుతూ వుండేవాడిని. అలా పరిచయం పెరిగింది. ఈ కరోనాకు ముందు యూనివర్శిటీలో జరిగిన ఒక సభలో దగ్గరకు పిలిచి నాన్నగారు లేరు ప్రముఖాంధ్ర నిలిపేస్తావేమో అనుకున్నా, కాని చక్కగా తీసుకుని వస్తున్నావు అంటూ అభినందిస్తూ జేబులో కొన్ని రూపాయలను పెట్టేసారు. ఏదో నాకు తోచినది నా వల్ల అయినది అన్నారు. అది నేనూహించినిది. అందరూ మన ముందు తిరుగుతున్నవారే వారికి సుస్తిగా వుందని కాని ఆసుపత్రి పాలయ్యారని కాని నేనెప్పుడు వినలేదు. ఇలా ఒకరొకరు వెళ్ళిపోవడం విషాదకరం.

పై ఐదుగురు ప్రముఖాంధ్రకు, నాన్నకు నాకు శ్రేయోభిలాషులు ఆత్మీయులు. వారి మరణం నాకు నమ్మలేని నిజం. అయినా నేను సామాన్యుడినే కాబట్టి ఇంకొంత కాలం వుంటే బాగుండేదని, అనిపించింది.

పైన చెప్పినట్టు నాకు మరణ వార్తలు రాయడం సరిగ్గారాదు. కాని నా మనసులో ఏమనుకున్నానో అది రాశాను. తప్పుకాదేమోననిపించింది. అంతే. ●

## గెలుపే సర్వస్వం కాదు, క్రీడా స్ఫూర్తి ముఖ్యం




టోక్యో ఒలింపిక్స్‌లో పురుషుల హైజంప్ ఫైనల్‌లో పతాక సన్నివేశం!!

ఫైనల్‌లో ఇటలీకి చెందిన జియాన్‌మార్కో తాంబేరి ఖతార్‌కు చెందిన ముతాజ్ ఎస్సా బార్షిమ్‌తో తలపడ్డారు. ఇద్దరూ 2.37 మీటర్లు దూకి సమానంగా ఉన్నారు! ఒలింపిక్ అధికారులు ప్రతి ఒక్కరికి మరో మూడు అదనపు ప్రయత్నాలు ఇచ్చారు, కానీ వారు 2.37 మీటర్లకు మించి చేరుకోలేకపోయారు. వారిద్దరికీ మరో ప్రయత్నం ఇవ్వడం జరిగింది, కానీ కాలికి తీవ్రమైన గాయం కావడంతో చివరి ప్రయత్నానికి ముందే తాంబెరి వైదొలిగారు.

బార్షిమ్ ముందు వేరే ప్రత్యర్థి లేనప్పుడు, అతను ఒంటరిగా బంగారు పతాకాన్ని సులభంగా చేరుకోగలిగిన క్షణం! అయితే బార్షిమ్ అధికారిని అడిగాడు "నేను తుది ప్రయత్నం నుండి వైదొలిగితే బంగారు పతాకాన్ని మా ఇద్దరి కీ పంచుతారా అని?

అవును, అప్పుడు బంగారు పతకం మీ ఇద్దరి మధ్య పంచబడుతుంది" అని ఒలింపిక్ అధికారి చెప్పాడు.


ఇంక ఆలోచించడానికి ఏమీ లేదు, చివరి ప్రయత్నం నుండి తాను ఉపసంహరించుకుంటున్నట్లు బార్షిమ్ ప్రకటించాడు. ఇది చూసిన ఇటాలియన్ ప్రత్యర్థి తాంబేరి పరిగెత్తుకువచ్చి బార్షిమ్‌ని కౌగిలించుకున్నాడు!

గెలుపే ముఖ్యమని, దానికోసం ఎలాంటి అడ్డదారుల నైనా తొక్కమని చెప్పేసే సమాజంలో, ఇలాంటి సన్నివేశం గొప్ప సందేశాన్ని ఇస్తోంది.

క్రీడల లక్ష్యం గెలుపు మాత్రమే కాదు, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడమనే స్ఫూర్తిని అందించే గొప్ప భావోద్వేగ సన్నివేశం ఇది.

దేశాలు, మతాలు, రంగులు, సరిహద్దులను దాటిన క్రీడా స్ఫూర్తికి ఇది ప్రత్యక్ష నిదర్శనం.





అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే
అఆ
320 నెలలుగా
320 సంచికలను
శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।
ప్రముఖాంధ్ర
- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల రేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!
'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.25000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)
గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు
చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
**Posted at Egmore / RMS Pathrika Channal, posted on 5 - 8, June, July & August 2021**

